
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


అదరగొట్టారు

ఇంటర్ ఫలితాల్లో 'తూర్పు'నకు నాలుగో స్థానం

గత ఏడాది కంటే మెరుగు

పదేళ్లలో అత్యధిక పాస్ నమోదు

ప్రథమ సంవత్సరం 77%, ద్వితీయ సంవత్సరం 87% ఉత్తీర్ణత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో తూర్పు గోదావరి జిల్లా విద్యార్థులు అదరగొట్టారు. గత పదేళ్లలో ఎప్పుడూ లేని మెరుగైన ఫలితాలను నమోదు చేశారు. ద్వితీయ సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. కేవలం 2% తేడాతో మూడో స్థానం చేజారింది. సెకండియర్‌లో 17,575 మంది పరీక్షలు రాయగా 15,362 మంది పాసై 87శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో 20,083 పరీక్షలు రాయగా 15,529 (77%) ఉత్తీర్ణత వచ్చి రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచింది. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం పరీక్షలకు కొద్ది నెలల ముందు నుంచే తగు కసరత్తు చేసి విద్యార్థులను సానబట్టడంతో గత పదేళ్లలో ఈ ఏడాది ఫలితాల్లో ముందు వరుసలోకి వచ్చింది. 2014లో ప్రథమ 59%, ద్వితీయ 66% ఉండగా ఈ ఏడాది ప్రథమ 77%, ద్వితీయ 83% నమోదు చేశాయి. గత ఏడాది ఈ ఫలితాలు 67%, 78% ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత కూడా గత ఏడాది కంటే 9%, 11% ఎక్కువగా నమోదైంది. సోషల్ వెల్ఫేర్ కాలేజీల్లో చదివిన విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారు. సెకండియర్‌లో 362 మందికి 351 (97%) పాసయ్యారు. హైస్కూల్ ప్లస్‌ల్లో 269కి 160 (59%) మంది మాత్రమే గట్టెక్కారు.


రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్‌కి ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మే నెలలో జరుగుతుంది. పరీక్ష ఫీజును ఈ నెల 15 నుంచి 22 వరకు చెల్లించవచ్చు. పరీక్షలు మే 12 నుంచి 20 వరకు నిర్వహిస్తారు.

రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సెకండియర్ బైపీసీ విద్యార్థి జె.సౌమ్యశాలిని వెయ్యికి 982 మార్కులు సాధించింది. ఆర్ట్స్ గ్రూపులో శ్రీలక్ష్మి 971, ఎంపీసీలో ప్రవల్లిక 970, ఎంపీహెచ్‌డబ్ల్యులో దుర్గాప్రసన్న 965 మార్కులు సాధించారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎస్ఎస్‌వీఎల్ నరసింహం, ఇన్చార్జి ప్రిన్సిపాల్ పి.త్రినాథరాజా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.


జె.సౌమ్యశాలిని
982, బైపీసీ సెకండియర్

యాజమాన్యాల వారీగా ఉత్తీర్ణత

మేనేజ్‌మెంట్	ఫస్టియర్ శాతం	సెకండియర్ శాతం
ప్రభుత్వ	43	64
ఎయిడెడ్	25	43
ఏపీ సోషల్ వెల్ఫేర్	93	97
హైస్కూల్ ప్లస్	34	59
ప్రైవేటు అన్ ఎయిడెడ్	85	91


బుద్ధ విహార్ వ్యవస్థాపకుడు జగదీశ్వరరావు


వేమగిరి కొండపై నిర్మించిన బుద్ధ విహార్‌లో ఆవిష్కరణకు సిద్ధమైన మహోదయ మైత్రేయ బుద్ధ విగ్రహం

జ్ఞానము.. ఆహ్లాదము!

వేమగిరి కొండపై బౌద్ధ క్షేత్రం

8 నేడు 84 అడుగుల మహోదయ మైత్రేయ బుద్ధ విగ్రహావిష్కరణ

అన్న'వరమే'



- అన్నవరం దేవస్థానంలో సౌకర్యాలకు పెద్దపీట
- ప్రభుత్వం మారడంతో కొండపై భారీగా అభివృద్ధి పనులు
- పూర్తయిన ప్రసాద్‌స్కీం టెండర్లు.. ఏడాదిన్నరలోగా పనుల పూర్తి
- మొత్తం రూ.21 కోట్లతో భక్తులకు వసతి సదుపాయాలు
- ఎకరంన్నర స్థలంలో రూ.10.34 కోట్లతో అన్నప్రసాద భవనం
- ఒకేసారి మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాదం
- రూ.11 కోట్లతో క్యూ కాంప్లెక్స్, మురుగునీటి శుద్ధిప్లాంటు
- రూ.8.32 కోట్లతో కాటేజీ.. రూ.80 లక్షలతో రెండో మెట్ల మార్గం
- అయిదేళ్లలో ఆలయ అభివృద్ధిని గాలికి వదిలేసిన వైసీపీ సర్కారు
- ప్రభుత్వం మారాక భక్తుల నుంచి నిరంతర ఐవీఆర్ఎస్ సర్వే
- సదుపాయాలపై ర్యాంకులతో అధికారులకు ముచ్చెమటలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రసిద్ధి చెందిన అన్నవరం సత్యదేవుడి ఆలయానికి భారీగా దశ తిరగబోతోంది. మునుపెన్నడూ లేనివిధంగా ఒకేసారి రూ.21 కోట్లకుపైగా విలువైన అభివృద్ధి పనులు పట్టాలెక్కబోతున్నాయి. గత వైసీపీ పాలనలో ఆలయ నిధులను అభివృద్ధి ముసుగులో వృథా చేసి, తలాకొంత మెక్కేయగా, ఇప్పుడు ప్రభుత్వం మారాక భక్తులకు సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఏళ్ల తరబడి పాతుకుపోయిన సమస్యలకు పరిష్కారం లభించబోతోంది. ఏటా లక్షల్లో తరలి వచ్చే భక్తులకు ఇకపై ఏ లోటు లేకుండా మౌలిక సదుపాయాలను భారీగా కల్పించడానికి రంగం సిద్ధమవుతోంది. ఎప్పుడో ప్రసాద్ స్కీం కింద ఆలయానికి నిధులు విడుదలైనా గత ప్రభుత్వం పట్టించుకోక వాటికి గ్రహణం పట్టింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఆలయానికి మహర్దశ పట్టబోతోంది. నిలిచిపోయిన నిధులను రప్పించడంతోపాటు పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. దీంతో త్వరలో ఇవి మొదలు కానున్నాయి. దేవస్థానం సైతం రూ.8.32 కోట్ల సొంత నిధులతో కాటేజీ నిర్మించాలని నిర్ణయించింది. ఇదికాక మరో రూ.80 లక్షలతో కొండపైకి రెండో మెట్ల మార్గం కొత్తగా నిర్మించబోతోంది. గత ప్రభుత్వం ఆలయాన్ని గాలికి వదిలేయగా, ఇప్పుడు ప్రభుత్వం మారాక సీఎం చంద్రబాబు ఆదేశాలతో కొండపై నిరంతర పర్యవేక్షణ జరుగుతోంది.

ఎన్ని సదుపాయాలో...

రూ.21 కోట్లతో ఖరారైన టెండర్లకు సంబంధించి ప్రధానంగా కొండపై అత్యవసరమైన అన్నప్రసాదం భవనాల సామర్థ్యాన్ని రూ.10.34 కోట్లతో పెంచబోతున్నారు. ఒకేసారి మూడువేల మంది కూర్చునేలా అన్నప్రసాదం భవనాలు నిర్మించనున్నారు. సత్రం గదులకు సమీపంలో ప్రస్తుత అన్నప్రసాద భవనానికి అతిసమీపంలో ఈ కొత్త భవనాల సముదాయాన్ని ఎకరంన్నర స్థలంలో నిర్మించబోతున్నారు. వచ్చే నెల నుంచి ఈ పనులు మొదలుపెట్టి ఏడాదిన్నరలోగా పూర్తి చేయాలని భావిస్తున్నారు. అలాగే అన్నప్రసాద భవనాలను ఆనుకుని క్యూ కాంప్లెక్స్, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.9.91 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే భక్తులు ఎంతమంది వచ్చినా సజావుగా అన్నప్రసాద వితరణ జరగనుంది. అలాగే కొండపైకి వచ్చే వేలాది భక్తులకు తాగునీటి వసతి, టాయిలెట్ బ్లాకులను రూ.61.78 లక్షలతో నిర్మించబోతున్నారు. మొబైల్ టాయిలెట్లను కూడా తీసుకువచ్చి కొండపై మరింత స్వచ్ఛ వాతావరణాన్ని పెంపొందించాలని భావిస్తున్నారు. కొండపైన భక్తులకు అందుబాటులోకి రూ.97.98 లక్షలతో రెండు ఎలక్ట్రికల్ బస్సులు రాబోతున్నాయి. ఇదికాక రూ.1.08 కోట్లతో కొండపై మురుగునీటిశుద్ధి నిర్వహణ చేపట్టనున్నారు. ప్రసాద్ స్కీం పనులతో సంబంధం లేకుండా ఆలయ నిధులతో పలు పనులు ప్రారంభించబోతున్నారు. అందులో రూ.8.32 కోట్లతో 125 గదులు నిర్మించేందుకు టెండర్లు పిలవగా దేవదాయ కమిషనర్ ఆమోదం తెలిపారు. రూ.80లక్షలతో కొండదిగువ నుంచి కొండపైకి రెండో కొత్త మెట్ల మార్గం పనులు ప్రారంభించారు. అలాగే రూ.2 కోట్లతో పశ్చిమరాజగోపురం వద్ద ఓ ఫార్మా సంస్థ షెడ్ల నిర్మాణానికి ముందుకొచ్చింది.



అప్పుడంతా గాలికి.. ఇప్పుడు ఐవీఆర్ఎస్..

గత వైసీపీ సర్కారు అన్నవరం దేవస్థానాన్ని గాలికి వదిలేసింది. ఏ చిన్న అభివృద్ధి పని చేయకుండా అయిదేళ్లు ఆలయాన్ని పట్టించుకోవడం మానేసింది. ఆలయ ఖజానాపై కన్నేసి కొండకింద అక్కర్లేని నమూనా ఆలయం పేరుతో కోట్లకు కోట్లు వృథా చేసేసింది. పనుల ముసుగులో కొందరు నేతలు భారీగా కాసులు నొక్కేశారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత ప్రభుత్వం అన్నవరం దేవస్థానంపై ప్రత్యేక దృష్టిసారించింది. భక్తులకు ఏ చిన్న ఇబ్బంది లేకుండా వసతులపై నిరంతరం పర్యవేక్షణ జరుపుతోంది. భక్తులకు ఫోన్లు చేసి ఐవీఆర్ఎస్ విధానంలో అభిప్రాయ సేకరణ జరుపుతోంది. భక్తులు తమ ఫోన్ నుంచి క్యూఆర్‌కోడ్ స్కాన్ చేస్తే ఆ నంబరుకు ఐవీఆర్ఎస్ కాల్స్ వెళ్తాయి. అప్పుడు వారు తమ అభిప్రాయాలను తెలిపిన దాన్ని బట్టి ఆలయానికి ప్రభుత్వం ర్యాంకింగ్ ప్రకటిస్తుంది. కొన్ని నెలల కిందట తొలి విడతలో ప్రకటించిన ర్యాంకులో దేవస్థానానికి చివరి ర్యాంక్ వచ్చింది. దీంతో సీఎంవో కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. దీంతో కలెక్టర్ నెలకొకసారి పర్యటించి పరిస్థితులు మెరుగుపరచడంతో ఆ తర్వాత సర్వేలో ఆలయానికి రెండో ర్యాంకు లభించింది. దీంతో ఆలయ అధికారులు నిత్యం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తూ భక్తులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నారు. సత్రం గదుల పరిశుభ్రత నిర్వహణ బాధ్యతలకు సంబంధించి ఒక్కో కాటేజీ ఒక్కో ఏఈవోకు అప్పగించారు. వీరు ప్రతిరోజు సత్రంగదులు తనిఖీచేసి రిపోర్టును అందజేస్తున్నారు. సీఆర్వో విభాగంలో పూర్తి ప్రక్షాళన చేపట్టారు. త్వరగా దర్శనానికి క్యూలైన్ వ్యవస్థలోనూ మార్పులు చేపట్టారు.

ఎక్కడికక్కడ లోపాలు సరిదిద్దుతూ..

అన్నవరం సత్యదేవుడి దర్శనానికి ఏటా తెలుగురాష్ట్రాలతో పాటు ఒడిషా, పశ్చిమబెంగాల్ నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ఏడాదికి ఇక్కడకు వచ్చే భక్తులు కోటి మందిపైనే ఉంటారు. తీరా భక్తుల రద్దీకి తగ్గట్టుగా కొండపై పెద్దగా సదుపాయాలు లేవు. దీంతో భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా అన్నప్రసాదానికి తాకిడి అధికంగా ఉంటోంది. ప్రస్తుతమున్న అన్న ప్రసాద భవనాలు ఒకేసారి 400 మంది మాత్రమే సరిపోతున్నాయి. దీంతో చాలా నిరీక్షణ ఉంటోంది. రద్దీ సమయాల్లో అయితే గంటల తరబడి వేచి ఉండలేక కొందరు కొండ కిందకు వెళ్లిపోతుంటే, కొందరు ధరాభారమైనా హోటళ్లలో తింటున్నారు. మరోవైపు ఇటీవల ఆలయంలో భక్తులకు అందుతున్న సదుపాయాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఈ లోపాలు అధికంగా వ్యక్తమయ్యాయి. ఫలితంగా ఆలయ పనితీరుకు సంబంధించి ర్యాంకు అట్టడుగుకుపోయింది. దీంతో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కలెక్టర్ ఆకస్మికంగా కొండపై పర్యటించి అన్న ప్రసాద కేంద్రంలో భక్తులకు బఫే విధానం అమలుచేయించారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొండపై కొందరికే అన్నప్రసాదం అందేది. రద్దీ సమయంలో రోజుకు 2,500 మందికి కూడా భోజనం వడ్డించలేదు. కానీ ప్రభుత్వం మారడంతో అందరికీ అన్నప్రసాదం ఇవ్వాలని కంకణం కట్టుకుంది. ఈ మేరకు ప్రసాద్ స్కీం కింద నిధులతో ఈ సదుపాయాలను భారీగా కల్పించాలని నిర్ణయించింది. వాస్తవానికి అన్నవరం దేవస్థానం కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిట్యుయల్ ఆగు మెంటేషన్ డ్రైవ్) స్కీం కింద 2021లో ఎంపికైంది. దీంతో వచ్చే నిధులతో కొండపై మౌలిక సదు పాయాల కల్పన చేపడుతున్నట్టు అప్పట్లో వైసీపీ సర్కారు ఊదరగొట్టింది. స్కీం కింద ఆలయానికి రూ.48 కోట్లు వస్తాయని ప్రకటించింది. కానీ చిల్లిగవ్వ రాలేదు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత కేంద్రంతో సంప్రదింపులు చేయడంతో రూ.21 కోట్లు విడుదలకాగా, ఇటీవల టెండర్లు పూర్తవగా, పనులు ప్రా రంభం కానున్నాయి. త్వరలో రెండో విడత కింద మరో రూ.20 కోట్లు రానున్నాయి.


15 నిమిషాల్లో గమ్యం...
మీడియాతో మాట్లాడుతున్న ఐజీ, ఎస్పీ తదితరులు

అంతలోనే మృత్యువు!

- ప్రవీణ్ మృతికి కారణం రోడ్డు ప్రమాదమే
- పోలీసుల దర్యాప్తులో వెల్లడి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

చుర్రున ఎండ.. సుమారు 500 కిలోమీటర్ల ప్రయాణం.. మద్యం.. అజాగ్రత్త.. వేగం వెరసి పాస్టర్ ప్రవీణ్ ప్రాణాలను తీశాయని పోలీసుల దర్యాప్తులో తేలింది. గత నెల 24న హైదరాబాద్‌లోని ఫస్ట్ రేట్ ఇన్ఫోటెక్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ, క్రైస్తవ బోధకుడు, మోటివేషనల్ స్పీకర్ పాస్టర్ పగడాల ప్రవీణ్ హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం బయలుదేరి 12 గంటలు ప్రయాణించి ఇంకో 15 నిమిషాల్లో గమ్యం చేరుతారనగా మృత్యువాత పడ్డారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆధారాలను విశ్లేషణ చేసి రోడ్డు ప్రమాదమని తేల్చారు. దానికి మద్యం, వేగం, అజాగ్రత్త కారణమని చెప్పారు. ప్రవీణ్ ప్రయాణంలో మూడు సార్లు ప్రమాదాలు జరిగాయి. ప్రవీణ్ మార్గ మధ్యలో నాలుగుసార్లు ఆగి మొత్తం రూ.2,842 విలువ చేసే మద్యం (బడ్వాయిజర్ మాగ్నం బీర్లు, రాయల్ చాలెంజ్ విస్కీ, బకార్డి జిన్) కొనుగోలు చేశారు.

● దర్యాప్తు సాగిందిలా..

కేసు తీవ్రత దృష్ట్యా డీఎస్పీ జి.దేవకుమార్ ఇంచార్జిగా, డీఎస్పీ వై.శ్రీకాంత్ పరిశోధనాధికారిగా ఐదు దర్యాప్తు బృందాలను ఏర్పాటుచేశారు. విజయవాడ నుంచి ప్రమాదం జరిగిన ప్రదేశం వరకూ ఒక బృందం, విజయవాడ నుంచి హైదరాబాద్ వరకూ ఒకటి, హైదరాబాద్ నగరంలో నివాస స్థలం వరకూ మరొకటి, విజయవాడ నగరంలో సీసీ కెమెరాలు పరిశీలన ఒక బృందం, సాంకేతిక విశ్లేషణకు.. ఇలా ఐదు బృందాలకు పని అప్పగించారు. జిల్లా ఫింగర్ ప్రింట్స్ యూనిట్, జిల్లా రవాణా అధికారి, ఇద్దరు ఎంవీఐ, ఇద్దరు ఏఎంవీఐ బృందం, మంగళగిరి నుంచి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్‌తో కూడిన బృందం ఘటనా స్థలాన్ని, బైక్‌ని క్షుణ్ణంగా పరిశీలించింది. హెల్మెట్, కళ్లజోడు, ఎన్ 95 మాస్కు, రక్తపు మరకలు ఉన్న వస్తువుల నమూనాలను ఆర్ఎఫ్ఎస్ఎల్‌కి పంపించారు.

● ప్రమాదం జరిగింది ఇలా..

ఐజీ అశోక్ కుమార్.. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌తో కలిసి ఈ కేసు దర్యాప్తు వివరాలను శనివారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం చేరుకునే క్రమంలో మద్యం మత్తు ప్రభావం ఆయనపై ఉండడంతో సుమారు గంటకు 70 కిలోమీటర్ల స్పీడుతో కేవలం సిగ్నల్ లైటు వెలుతురులో డ్రైవ్ చేస్తూ కొంతమూరు నయారా పెట్రోల్ బంకు సమీపంలో అదుపుతప్పి రోడ్డు దిగారు. రోడ్డు బెర్మ్‌పై కంకర పరిచి ఉంది. దానిపై జారి 7 అడుగుల లోతులో ఉన్న ఒక రెయిన్ వాటర్ డ్రెయిన్‌లోని గోతిలో పడిపోయారు. ఆయనపై బుల్లెట్ పడింది. ఆయన శరీరంలోని కాలేయం, కిడ్నీ తదితర భాగాల్లో ఇథైల్ ఆల్కహాల్(మద్యం) గుర్తించామని ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులో ఉంది. ఆయన ప్రమాదం జరిగిన చోటే ప్రాణాలు విడిచారని పోస్టుమార్టం చేసిన వైద్యుల బృందం రిపోర్టు చెబుతోంది.



వైద్యుల బృందం శవ పరీక్ష చేసింది. కొవ్వూరు టోల్‌గేట్ దాటిన తర్వాత అంటే ప్రమాదం జరగడానికి కొద్దినిమిషాల ముందు.. ప్రవీణ్ వాహనంతోపాటు ప్రయాణించిన వాహనాలను పరిశీలించారు. రాపిడి మరకలు ఏమీ లేవని నిర్ధారించుకున్నారు. మార్గమధ్యలో ఆయన 6 చోట్ల యూపీఐ పేమెంట్లు చేశారు. అవి ఆయన ఎక్కౌంటుతో సరిపోయాయి. గతనెల మార్చి 12, 13 తేదీల్లో రాజమండ్రిలో సుధా వైన్స్‌లో ప్రవీణ్ మద్యం కొనుగోలు చేసిన ఫుటేజీలనూ సేకరించారు. మొత్తం 14 రోజుల దర్యాప్తులో 100 మందిని విచారించారు. మార్గమధ్యలో ఆరుగురితో ఫోనులో మాట్లాడారు. అవి మామూలు మాటలే. ఒకసారి భార్యతో మాట్లాడారు. విజయవాడ దాటుతున్నానని ముక్తసరిగా చెప్పి ఫోన్ పెట్టేశారు.

ఇప్పుడైనా నిగ్గు తేలుస్తారా!

- ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌లో పంచాయతీ అధికారులపై అవినీతి ఆరోపణలు
- విచారణలో కాలయాపన... తాజాగా విచారణాధికారిగా డీపీవో శాంతామణి నియామకం

రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అధికారులు మారుతున్నారు... ప్రభుత్వాలు మారుతున్నాయి... చివరకు జిల్లాలు కూడా మారాయి... అయినా అవినీతి ఆరోపణలతో చార్జి మెమో ఇచ్చిన వారిపై నేటికీ చర్యలు లేవు.. సరికదా విచారణలు కొనసాగుతూనే వున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట, పిడింగొయ్యి పంచాయతీల పరిధిలో ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ప్రభుత్వానికి లక్షలాది రూపాయలు నష్టం చేకూర్చారన్న ఆరోపణలొచ్చాయి. దీంతో 2016లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అప్పటి గ్రామాల ప్రత్యేకాధికారి, డీఎల్పీవో కేపీ చంద్రశేఖర్, హుకుంపేట గ్రామ కార్యదర్శి బి.రామశ్రీనివాస్, పిడింగొయ్యి గ్రామ కార్యదర్శి, ధవళేశ్వరం పంచాయతీ ప్రస్తుత కార్యదర్శి జి.వెంకట్రావులకు చార్జ్ మెమో జారీ చేశారు. అప్పటి ఉమ్మడి జిల్లా పంచాయతీ అధికారులుగా పనిచేసిన టీవీజీ కుమార్, వి.నాగేశ్వరనాయక్‌లను విచారణాధికారులుగా నియమించారు. విచారణ ప్రక్రియను పూర్తి చేయకుండా కాలయాపన చేశారు. తాజాగా ప్రస్తుత జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణిని విచారణాధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ ప్రక్రియను ఇప్పుడైనా నిష్పక్షపాతంగా నిర్వహిస్తారో లేదో వేచి చూడాలి. కాగా విచారణాధికారి మార్పు విషయంలో రూరల్ మండలానికి చెందిన ప్రముఖ అధికారి చక్రం తిప్పినట్టు పలువురు ఆరోపిస్తున్నారు.

రెక్కలూడుతున్న వైసీపీ

కూటమిలోకి ఒక్కొక్కరుగా చేరుతున్న ఆ పార్టీ నేతలు

జనసేన ఖాతాలో తొలి మున్సిపాల్టీ నిడదవోలు



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రతిపక్ష వైసీపీ రెక్కలు ఊడిపోతున్నాయి. అధికారం కోల్పోయిన ఏడాదికే ఆ పార్టీలో తీవ్ర ఉక్కపోత మొదలైంది. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకెళ్తుండడంతో ప్రజలు సానుకూలంగా కనిపిస్తున్నారు. దీంతో వైసీపీ నేతలు ఒక్కొక్కరుగా నెమ్మదిగా పార్టీని విడిచి పెట్టేస్తున్నారు. కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ ఇప్పటికే సుమారుగా ఖాళీ అయిపోయింది. కొందరు జడ్పీటీసీలు, ఎంపీపీ టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. మున్సిపల్ చైర్‌పర్సన్ వైసీపీకి చెందిన వారైనప్పటికీ ఆమె టీడీపీ నేతలతో సన్నిహితంగా ఉండడం గమనార్హం. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నియోజకవర్గమైన నిడదవోలు మున్సిపాల్టీ జనసేన ఖాతాలో జమ అయింది. ఇది రాష్ట్రంలో ఆ పార్టీకి దక్కిన తొలి మున్సిపాల్టీ కావడం గమనార్హం. నిడదవోలు మున్సిపాల్టీని గత ఎన్నికల్లో వైసీపీ గెలుచుకుంది. 28 మంది కౌన్సిలర్లు ఉండగా 27 మంది వైసీపీ నుంచి, ఒకరు టీడీపీ నుంచి గెలిచారు. కానీ మంత్రి కందుల దుర్గేష్ రాజకీయ చతురతతో చైర్మన్, వైస్ చైర్మన్ సహా మొత్తం 13 మంది కౌన్సిలర్లు జనసేనలో చేరారు. ఒక టీడీపీ కౌన్సిలర్‌తో వీరి సంఖ్య 14కు చేరింది. మంత్రి దుర్గేష్‌కు ఎక్స్‌అఫీషియో సభ్యునిగా ఓటు హక్కు ఉండడంతో జనసేన బలం 15కి చేరింది. ఈ నేపథ్యంలో వైసీపీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చింది. కానీ మెజార్టీ సభ్యులు కూటమివైపు రావడంతో అది వీగిపోయింది. ఇటీవల బిక్కవోలు ఎంపీపీ పీఠం బీజేపీకి దక్కిన సంగతి తెలిసిందే. అక్కడ వైసీపీ కనీసం పోటీకి కూడా రాలేకపోయింది.


జనసేనలో చేరిన కౌన్సిలర్లతో మంత్రి దుర్గేష్

'నిడదవోలు'ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
మంత్రి దుర్గేష్ 10

పొట్ట కూటి కోసం వెళ్లి విగతజీవులయ్యారు

- విద్యుత్ ప్రమాదంలో ముగ్గురి మృతి
- కోరుకొండ మండలం కాపవరం రైస్‌మిల్లు వద్ద ఘటన

వివరాలు 9లో

అగ్గి రేగితే... బుగ్గే



- మండుతున్న ఎండలు
- అగ్ని ప్రమాదాలు జరిగేందుకు అవకాశం
- ముందస్తు జాగ్రత్త చర్యలు తప్పనిసరి

వేసవి వచ్చేసింది. ఎండలు మండిపోతున్నాయి. అగ్ని ప్రమాదాలకు ఇదే అదను. మానవ తప్పిదం వల్లో లేక ప్రకృతి వైపరీత్యం వల్లో ఈ సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే సర్వం క్షణాల్లో బుగ్గిపాలవుతుంది. ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం సంభవించేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

(కాకినాడ క్రైం-ఆంధ్రజ్యోతి)

వేసవిలో ఎక్కడో ఒకచోట అగ్ని ప్రమాదాలు సంభవిస్తూనే ఉంటాయి. కొంతమంది ఆకతాయిలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చుట్ట, సిగరెట్లను ఆర్పకుండా ఎండు గడ్డిపైన వేయడమో లేక చెత్తకుప్పలపైన వేయడమో చేస్తుండడంతో భారీ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇవే కాకుండా షార్ట్ సర్క్యూట్ సంభవించి కూడా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి.



గ్రామాల్లో రైతులు భద్రపర్చుకునే ధాన్యం రాశులు, గడ్డివాములు వేసవి కాలంలో తరుచూ అగ్ని ప్రమాదాలకు గురవుతాయి. ఈ గడ్డివాములను దూరం ఎక్కువ పెడితే ఎక్కువ ఆస్తి నష్టం సంభవించకుండా ఉంటుంది. రైతులు ఎక్కడైనా వ్యర్థాలను తగులపెట్టేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవడం శ్రేయస్కరం. ముఖ్యంగా పెట్రోల్ బంకుల వద్ద సెల్‌ఫోన్ మాట్లాడడం చాలా ప్రమాదకరం. పెట్రోల్ బంకుల యాజమాన్యం ఒకవేళ ప్రమాదం జరిగితే మంటలను అదుపు చేసేందుకు డీసీపీ వంటి సిలెండర్లను అందుబాటులో ఉంచుకోవాలి.

ఎండా కాలంలో ఎక్కువ కరెంట్ వాడడం వల్ల షార్ట్ సర్క్యూట్ సంభవించే అవకాశాలున్నాయి. ముఖ్యంగా పాత విద్యుత్ వైర్లు,



కాలం చెల్లిన స్విచ్‌లు, స్విచ్ బోర్డులను మార్చి కొత్త వాటిని వినియోగంలోకి తీసుకొస్తే షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం ఉండదు.

ఇళ్లల్లో రాత్రివేళ వంట పూర్తయిన తర్వాత గ్యాస్ స్టౌ రెగ్యులేటర్‌ను కట్టడం తప్పనిసరి. సిలిండర్‌కు ఐఎస్ఐ ముద్ర కలిగిన ట్యూబ్ మాత్రమే వాడాలి. సిలిండర్ నుంచి గ్యాస్ లీకయితే దళసరి దుప్పటి లేదా గోనెసంచి సహాయంతో రెగ్యులేటర్ వద్ద చుట్టి అగ్నిని నివారించవచ్చు.

ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా అగ్ని ప్రమాద నివారణ పరికరాలను అమర్చాలి.

భారీ, చిన్నతరహా పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి.

ముఖ్యంగా అపార్ట్‌మెంట్ల చుట్టూ అగ్నిమాపక శకటం తిరిగే విధంగా ఖాళీ వదలాలి.

పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన విషయాలపై ఎప్పటికప్పుడు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించాలి.



పాఠశాలలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు విద్యార్థులను రక్షిస్తూ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

ముఖ్యంగా బాణసంచా తయారీ కేంద్రాల్లో అగ్నిమాపక శాఖాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి లైసెన్స్, తయారీ విధానం సక్రమంగా ఉన్నాయో లేవో పరిశీలిస్తూ ఉండాలి.

ఎటువంటి విపత్తులను ఎదుర్కొనేందుకైనా సంసిద్ధంగా ఉన్నాం



పోలుమహంతి వెంకటసాయి రాజేష్
కాకినాడ జిల్లా అగ్నిమాపక శాఖాధికారి

వేసవి కాలం మొదలైంది కాబట్టి ప్రకృతి వైపరీత్యాలతోపాటు మానవ తప్పిదాలతో కూడిన ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలున్నాయి. కాకినాడ తీర ప్రాంతం కాబట్టి తుపాను తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి పాఠశాలలు, కళాశాలలు, పరిశ్రమలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్ల వద్ద మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్నాం. ఒకవేళ పెద్ద వైపరీత్యం సంభవిస్తే ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి ఎదుర్కోవడానికి సన్నద్ధంగా ఉన్నాం. జిల్లావ్యాప్తంగా ఏడు అగ్నిమాపక కేంద్రాలు వుండగా 101 మంది సిబ్బంది ఉన్నారు. ఎనిమిది అగ్నిమాపక శకటాలున్నాయి. ప్రతి అగ్నిమాపక కేంద్రంలోనూ అత్యాధునిక అగ్ని ప్రమాద నివారణ పరికరాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అగ్నిమాపక శాఖకు మరిన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చనుంది. పెద్ద అగ్ని ప్రమాదాలు సంభవిస్తే భారీ పరిశ్రమలకు సంబంధించిన అగ్నిమాపక శకటాలు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా వున్నాయి.




వేమగిరి కొండపై బౌద్ధ క్షేత్రం.. ధ్యాన ముద్రలో తథాగతుని విగ్రహం

వేమగిరి కొండపై బౌద్ధ క్షేత్రం

నేడు 84 అడుగుల మహోదయ మైత్రేయ బుద్ధ విగ్రహావిష్కరణ

కడియం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పచ్చని పసిడి వర్ణాల ప్రాంతం కడియంలో రాజమహేంద్రవరానికి కూతవేటు దూరంలో వేమగిరి కొండపై పోలీసు విశ్రాంత ఉద్యోగి యార్లగడ్డ జగదీశ్వరరావు బౌద్ధ క్షేత్రాన్ని నిర్మించారు, ఇందులో బుద్ధుని 84 అడుగుల విగ్రహావిష్కరణ ఆదివారం జరగనుంది. ఉండ్రాజవరం బౌద్ధ కేంద్రం బౌద్ధ భిక్షువు అనలియో, కర్నాటక బైలుకుప్పం ప్రాంతంలోని బౌద్ధ కేంద్రానికి చెందిన భిక్షువులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు విశిష్ట అతిథులుగా హాజరుకానున్నారు.

ఉద్యోగం చేసిన కాలం నుంచే..

ఉద్యోగ జీతానికి తోడు మరికొంత రుణం చేసి జగదీశ్వరరావు వేమగిరిలో 1996లో కొంత స్థలాన్ని కొనుగోలు చేశారు. 1998లో మరో 73 సెంట్లు స్థలం కొని ఆనాటి నుంచి బౌద్ధ క్షేత్రానికి ఏర్పాట్లు చేయడం మొదలు పెట్టారు. 2013లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. 2013లో బుద్ధుని విగ్రహ రూపకల్పనకు శిల్పులు పనులు ప్రారంభించగా 2019 వరకు సాగాయి. విగ్రహం భూమిలో 33 అడుగులు పునాది ఉంది. ఆపై బుద్ధుని కాళ్ల వరకు 18 అడుగులు, ఆపై 66 అడుగులు... వెరసి 84 అడుగుల విగ్రహం ఏర్పాటు చేశారు. వేమగిరి బుద్ధ విహార్‌లో నేల తాడి, నేల ఉసిరి, గుంట కాడ ఆకు, పొన్నగంటి కూర, సర్వసతి ఆకు, రావి, వేప, సీతాఫలం, లక్ష్మణఫలం, రామతులసి, లక్ష్మణతులసి వంటి అనేక రకాల మొక్కలు పెంచుతున్నారు. మహనీయులు, దేశ నాయకుల విగ్రహాలు ఏర్పాటుచేసి వారి జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నారు. బుద్ధ విగ్రహం కింద చుట్టూరా ధర్మ హాలు ఏర్పాటు చేశారు. దీంట్లో బౌద్ధం, చరిత్ర, సాహిత్యం వంటి అనేక రచనలకు సంబంధించిన వందలాది పుస్తకాలను భద్రపరిచారు.

1955 అక్టోబరు 10న జన్మించిన జగదీశ్వరరావు పదో తరగతి పూర్తిచేసి 1975లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఉద్యోగం చేస్తూనే ప్రైవేటుగా ఆంధ్రా యూనివర్శిటీ నుంచి ఎంఏ (సోషియాలజీ), ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో లా డిగ్రీ, మేనేజ్‌మెంట్ ఆఫ్ వలంటరీ ఆర్గనైజేషన్‌లో పీజీ డిప్లొమా చదివారు. 1991లో ఎస్ఐ పోటీ పరీక్షకు హాజరై ఉద్యోగం సాధించారు.

మహనీయుల చరిత్రలు చదివి బుద్ధిజం వైపు అడుగులు

మహోదయ యాజరా
బుద్ధవిహార్ వ్యవస్థాపకుడు




బుద్ధిజం గొప్పదని ఆనాడు మహనీయుడు గురజాడ అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రాహుల్ సాంకృత్యాయన్, భారతదేశ చారిత్రక పితామహుడు డీడీ కోశాంబి వంటి మహనీయుల రచనలు చదివి నేను బుద్ధిజం వైపు అడుగులు వేశాను. హేతువాదం, నాస్తికత్వం, సైన్సు, తత్వశాస్త్రాల్లో పలు రచనలు చేశారు. ప్రవక్తలు, తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, సంఘ సంస్కర్తలు, విప్లవకారులు, త్యాగధనుల చరిత్రలు చదివాను.

బౌద్ధ క్షేత్రంలో 'చిత్రాలు'



బుద్ధ విగ్రహం కింది భాగంలో నిర్మించిన ధర్మ హాలు



ఎందరో మహానుభావులు.. అందరూ ఇక్కడే..



బౌద్ధ వనంలో బుద్ధ భగవానుని విగ్రహం.. ఆకట్టుకునే తైలవర్ణ చిత్రపటం



'శ్రీప్రకాష్' విద్యార్థుల ప్రభంజనం



ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

తునిరూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ తెలిపారు. తమ కళాశాల నుంచి 15 మంది పైగా విద్యార్థులు 980కంటే ఎక్కువ మార్కులు సాధించారని తెలిపారు. ఎంపీసీలో ఆర్ ఎస్ఎస్ నగేష్(464/470), జి.అనూష (460/470), కె.యామినీ జ్యోతిక(460/470), జి.లాస్యశ్రీ (460/470), బైపీసీలో ఆర్.నాగసూర్య భవ్య(429/440), ద్వితీయ సంవత్స రంలో ఎంపీసీలో ఎ.హర్షిత 988/1000, ఎస్.మేఘన 986/1000, బైపీసీలో ఎం.సత్యఅక్షయ 986/1000, సీహెచ్ పూర్ణశివాని 984/1000 మార్కులు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్ వి.కె నరసింహారావు, ప్రిన్సిపాల్ వీవీఎస్‌బీ.భాను మూర్తి, అకడమిక్ ఇన్‌చార్జి డి.శ్రీలక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో రామేశ్వరంలో 15 శాతం ఉత్తీర్ణత

- అంతర్వేదిపాలెంలో సున్నా శాతం

అంతర్వేది, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంత్వేదిపాలెం హైస్కూలు ప్లస్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ఆరుగురు విద్యార్థులు పరీక్షలు రాయగా సున్నా శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో డి.కిశోర్‌కుమార్ తెలిపారు. అలాగే రామేశ్వరం హైస్కూలు ప్లస్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో 11 మంది పరీక్షలు రాయగా ఒక విద్యార్థి ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీలో ఎనిమిది మంది పరీక్షలు రాయగా ఇద్దరు మాత్రమే ఉత్తీర్ణులై 15 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో కిశోర్‌కుమార్ తెలిపారు.

57 మంది విద్యార్థుల్లో ఒక్కడే పాస్

రౌతులపూడి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌ఫలితాల్లో రౌతులపూడిలోని జడ్పీ హైస్కూల్లో ప్లస్(ఇంటర్) ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీలో 57 మంది హాజరు కాగా ఒక్కడు మాత్రమే ఉత్తీర్ణుడయ్యాడు. కాగా సదరు పాఠశాలలో ఈ ఏడాదే ఇంటర్ తరగతులు ప్రారంభించారు.

16 మందికి ఒక్కరే..

బిక్కవోలు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో బిక్కవోలు జడ్పీ ప్లస్ పాఠశాలలో సీఈసీ గ్రూపు నుంచి ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 16 మంది హాజరు కాగా ఒక్కరే పాసయ్యారని హెచ్ఎం పి.వీ రప్రభాకరరావు తెలిపారు. పాఠశాలలో ఈ ఏడాదే ఇంటర్ ప్రారంభించారన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'తిరుమల' ప్రభంజనం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో తిరుమల అకడమిక్ డైరెక్టర్లు

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో రాజమహేంద్రవరం తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470కు 467 మార్కులు ఐదుగురు విద్యార్థులు యు.విరోనిక, ఎం.హర్షిత, ఎస్.తేజ, జి.రాజన వీస్‌తేజ, ఎ.వీరవెంకట సాయిలిఖి సాధించారని, 466మార్కులు పైన 31మంది, 464 మంది పైన 369 మంది, 460 పైన 1086 మంది, 450 పైన 2,133 మంది సాధించి 99.20 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 440కి 436 మార్కులు 11మంది విద్యార్థులు కె.సుప్రియ, ఎ.రామతేజస్విని, సీహెచ్ నేహాగ్రేస్, జి.మోహన రూప, జె.భవిత, కె.గాయత్రి, జి.సరయు, బి.యశశ్విని, షేక్‌సమీనా, ఆర్.వీరగంగ నాగేంద్ర, పి.ప్రణవసాయిగణేష్ సాధించారని, 435 పైన 32 మంది, 433 పైన 91 మంది, 430పైన 167 మంది, 400పైన 463 మంది మార్కులు సాధించి 99.47 ఉత్తీర్ణత సాధించారన్నారు.

సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను 991 మార్కులు ఏడుగురు విద్యార్థులు ఎం.ప్రియహాసిని, సీహెచ్ హరి సూర్య, బి.పవిత్ర, కె.మానస, ఎస్.లేఖన, ఎస్.సాయిలిఖిత, వి.దాత్రికావ్యశ్రీ సాధించారన్నారు. 23 మంది విద్యార్థులకు 990 మార్కులు, 331 మంది విద్యార్థులకు 985పైన, 791 మంది విద్యార్థులకు 980 పైన, 2,151 మంది విద్యార్థులకు 950మార్కులు పైన సాధించి 99.98 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను షేక్ ఫాతీము స్నీషాబేగం 991మార్కులు, బి.నాగవైష్ణవి, సీహెచ్ వీడీ రేణుక, ఎన్.వైష్ణవి, బిహర్షిత, ఎన్.మణి, జి.రితిక 990 మార్కులు సాధించారన్నారు. 108 మంది విద్యార్థులకు 980 పైన, 204మంది విద్యార్థులకు 970 పైన, 297 మంది విద్యార్థులకు 950 పైన మార్కులు సాధించి ఉత్తీర్ణత నూరు శాతం సాధించారన్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను తిరుమల రావు అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 'ఆదిత్య' జయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య కార్యదర్శి ఎన్.కృష్ణ దీపక్‌రెడ్డి

కాకినాడ రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో జూనియర్, సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఆదిత్య జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి జయకేతనం ఎగురవేసినట్లు ఆదిత్య కార్యదర్శి ఎన్.కృష్ణ దీపక్‌రెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో వై.ప్రసన్నాంబిక, బి.లక్ష్మీ సంజన, కె.బాల వెంకటేశ్వరరావు టి.మాధవి 470 మార్కులకుగానూ 466, 16మంది విద్యార్థులు 465 మార్కులు పొందారన్నారు. బైపీసీలో టి.సాహితి, బి.అనిత 440 మార్కులకుగానూ 435, ఒకరు434, ఇద్దరు 433, 8మంది 432 మార్కులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎన్.సవిత 1000మార్కులకు గానూ 992, షేక్ అసిన్, కె.యాస్మిన్‌షేక్ 991, నలుగురు 990, 7గురు 989, ముగ్గురు 988 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో టీవై.ప్రియ, సుహ్రాది 1000మార్కులకుగానూ 989, ఒకరు 987, ఇద్దరు 986, ఒకరు 985, ఎంఈసీలో దుర్గాచంద్రిక 980, త్రిపుర నాగ 976, ఒకరు 974మార్కులు పొందినట్లు తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆదిత్య విదాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి ఎన్.కృష్ణ దీపక్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎన్.సతీష్ రెడ్డి, సమన్వయకర్త లక్ష్మీకుమార్ అభినందించారు.

వైభవంగా స్వామివారి చక్రస్నానం

- పాల్గొన్న ఆర్డీవో శ్రీకర్, డీసీ చక్రధరరావు
- గోదావరి తీరం భక్తజన సంద్రం




అశేష భక్తజనం నడుమ స్వామివారి గ్రామోత్సవం, చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవాలలో భాగంగా ఆరోవ రోజు శనివారం స్వామివారికి మేల్కొలుపు, గోదావరి నదీ జల సంగ్రహణం, నిత్యార్చన, ప్రధాన హోమాలు, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలు వేదపండితులు ఘనంగా నిర్వహించారు. వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. గౌతమి గోదావరి నదీ తీరాన చలువ పందిర్లను ఏర్పాటుచేసి సుదర్శనమూర్తికి పంచామృతాభిషేకం నిర్వహించారు.

గౌతమి నదీతీరాన స్వామివారి చక్రస్నాన మహోత్సవం వేలాది మంది భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో శ్రీకర్ దంపతులు, ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు దంప తులు, కూటమి పార్టీ శ్రేణులు చక్రస్నానం నిర్వహించారు. అనంతరం సా యంత్రం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు కల్యాణోత్సవ పూజలునిర్వహించారు. బలిహరణ, ధ్వజావరోహణం నిర్వహించి కార్యక్రమాలను ముగించారు. ఆదివారం శ్రీపుష్పోత్సవంతో శ్రీవారి కల్యాణోత్సవాలు ముగియనున్నాయి.

'షిర్డిసాయి' విజయబావుటా

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షా ఫలితాల్లో షిర్డిసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అ త్యుత్తమ ఫలితాలతో విజయ బావుటా ఎగురవేశారని శ్రీషిర్డిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య వెల్లడించారు. ఫస్టియర్ ఫలితాల్లో ఎంపీసీ 470 మార్కులకు 465 జి.మెహర్‌సత్యప్రసాద్, ఎం.అభినవ్‌వివేక్‌లు ప్రథమ స్థానంలో, 464మార్కులతో ఎస్‌వీపీ వర్షిత్, ఎం. తను శ్రావ్యశ్రీ, వై.బ్లెస్సీ ద్వితీయ, 463 మార్కులతో బి.సాయిప్రకాష్, కె.తేజస్విని, ఎస్. నిత్యశ్రీ, పి.భద్రసాహితీ, ఎన్.లలిత, ఆర్.హాజీరా తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బైపీసీలో 440మార్కులకుగాను 428తో ఎస్.తేజశ్రీ ప్రథమ స్థానాన్ని, 416 మార్కులతో డి.దేవిసాయి ద్వితీయ స్థానాన్ని సాధించారు. మొత్తం 16మంది 460పైగా మార్కులు సాధించగా, 63మంది 450పైగా సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో వి.మ ణికంఠ 990 మార్కులతో ప్రథమస్థానాన్ని, ఎం. హాసిని, ఎన్.నందిని, వి.శివకేశవ, జి.సాయిముఖేష్ 987 మార్కులతో ద్వితీయస్థానాన్ని, జి.దివ్య 986మార్కులతో తృతీయస్థానాన్ని కైవసం చేసుకున్నారు.



విద్యార్థులలతో చైర్మన్ శ్రీధర్, అధ్యాపకులు

కవల పిల్లల బావిని సందర్శించిన మంత్రి

- బావి అభివృద్ధికి హామీ ఇచ్చిన మంత్రి దుర్గేష్

రంగంపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కవల పిల్లల బావిని మంత్రి దుర్గేష్ సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం పెద్ద దొడ్డిగుంట గ్రామంలో ఉన్న కవల పిల్లల బావి గురించి ఈనెల 6వ తేదీన ఆంధ్రజ్యోతి ఆదివారం పుస్తకంలో 'ఆ పల్లె ఇంట..కవలల పంట' అనే శీర్షికతో కవర్‌స్టోరీ ప్రచురితమైన విషయం తెలుసుకున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్థానిక నాయకులతో కలిసి శనివారం పెద్దదొడ్డిగుంటలో ఉన్న కవల పిల్లల బావిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో ఉన్న కవల పిల్లల బావి నీరు ఇతర రాష్ట్రాలకు, దేశాలకు కూడా సరఫరా అయ్యి మన గ్రామంతో పాటు జిల్లా, రాష్ట్రానికి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఈ బావి అభివృద్ధికి తమ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ తరుపున కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మంత్రివెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.



కవల పిల్లల బావిని సందర్శిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, తదితరులు

వేగం.. మిగిల్చింది చేదు జ్ఞాపకం!

- డివైడర్‌ను ఢీకొని పంటపొలాల్లోకి పల్టీలు కొట్టిన కారు
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్రగాయాలు, ఏడుగురికి స్వల్పగాయాలు
- బాధితులంతా చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం బందార్లపల్లికి చెందినవారు
- యర్నగూడెం జాతీయ రహదారిపై ఘటన


గాయపడిన చందన


క్షతగాత్రులను అంబులెన్స్‌లో తీసుకెళ్తున్న స్థానికులు


ధ్వంసమైన కారు

దేవరపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబానికి చెందిన 10 మందితో ప్రయాణిస్తున్న కారు తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలోని యర్నగూడెం జాతీయ రహదారిపై శనివారం ప్రమాదానికి గురైంది. డివైడర్‌ను ఢీకొనడంతో పంటపొలాల్లోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా రామకుప్పం మండల బందార్లపల్లికి చెందిన ఓ కుటుంబం ఈ నెల 10న దైవదర్శనం కోసం కారులో బయల్దేరి విజయవాడలోని కనకదుర్గమ్మ, భద్రాచలంలోని రాములవారిని దర్శించుకున్నారు. ఈ క్రమంలో 11న తేదీ రాత్రి అన్నవరం చేరుకుని అక్కడే రాత్రి బసచేశారు. అనంతరం శనివారం ఉదయం సత్యనారాయణస్వామి దర్శనం చేసుకుని తిరిగి ప్రయాణిస్తుండగా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో యర్నగూడెం జాతీయ రహదారిపై కారు డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఇందులో ప్రయాణిస్తున్న 10 మందిలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, గౌరక్కగారి చిన్నమ్మాయి, షబ్రేష్, పోతుల చందనాకు తీవ్రగాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్పగాయాలైన వారికి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం తీవ్రగాయాలైన ముగ్గురిని రాజమండ్రిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ గౌరక్కగారి శ్రీకాంత్ కారును వేగంగా నడపటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు గుర్తించారు. ఇందులో గౌరక్క గారి చిన్నమ్మాయి, పోతుల లత, పోతుల సోమశేఖర్, పోతుల యశ్వంత్, పోతుల చందన, భార్గవి, షబ్రేష్, లతిక, శిరీషతోపాటు ముగ్గురు చిన్నారులున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పొట్ట కూటి కోసం వెళ్లి విగతజీవులై...

- విద్యుత్ షాక్‌తో ముగ్గురి మృతి
- మరో ముగ్గురికి గాయాలు
- కాపవరం రైస్ మిల్లు వద్ద ప్రమాదం


మృతిచెందిన శ్రీరామ్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ


ప్రమాదానికి కారణమైన ట్రాలీ


సంఘటనా స్థలంలో బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల, పోలీసు అధికారులు

కోరుకొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కాపవరం మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని రైస్ మిల్లు వద్ద శనివారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. కాపవరం గణపతి రైస్‌మిల్లులో శనివారం ఉదయం ధాన్యం లోడు చేసే కన్వర్ట్ బెల్ట్‌ను ట్రాలీపై తీసుకెళ్తుండగా సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు ట్రాలీ చివరి భాగం తగిలి షాక్‌కు గురయ్యారు. ఆకుల శ్రీరామ్(30), జాజుల వెంకటేశ్వరరావు(55), బలసాల అన్నవరం సత్యనారాయణ(45) అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పొట్ట కూటి కోసం వెళ్లిన తమ వారు విగతజీవులుగా మారడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాద విషయం తెలియడంతో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రాజమండ్రి నార్త్ జోన్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5లక్షలు వంతున ప్రభుత్వం నుంచి సహాయం అందించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే మిల్లు యాజమాన్యం ఒక్కో కుటుంబానికి రూ.15లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని పెద్దల సమక్షంలో నిర్ణయించినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాగా కాపవరం విద్యుత్ ప్రమాదంపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యకిషోర్ పేర్కొనారు.. మృతదేహాలకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదే ప్రమాదంలో షాక్‌కు గురై స్వల్పంగా గాయపడిన శ్రీరంగం నాగు, ఆకుల ఏసురాజు, కోరుకొండ రాజులు క్షేమంగానే ఉన్నారు.

రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు..

విద్యుత్ ప్రమాదంలో మరణించిన ఆకుల శ్రీరామ్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ కుటుంబాలు రెక్కాడితే కాని డొక్కాడని వ్యవసాయ రైతు కూలీలు. ప్రతిరోజు రైస్ మిల్లుకు వెళ్లి లారీ లోంచి ధాన్యం బస్తాలు దింపి మిల్లుకు వేయడం, మిల్లులో తయారైన బియ్యం లారీలో లోడ్ చేయడం చేస్తుంటారు. అలా కూలి డబ్బులతోనే వారి జీవనం గడుస్తుంది. శ్రీరామ్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు. పిల్లలు చిన్నవారు కావడం, కుటుంబంలో పెద్ద దిక్కు చనిపోవడంతో దిక్కులేని వారయ్యారు. వెంకటేశ్వరరావుకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు. ముగ్గురికీ వివాహాలయ్యాయి. వెంకటేశ్వరరావు మిల్లులో పనిచేసే డబ్బులతోనే కుటుంబ పోషణ జరిగేది. అన్నవరం సత్యనారాయణకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ముగ్గురు మరణించడంతో నిరుపేద కుటుంబాలు రోడ్డున పడ్డాయి. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. సర్పంచ్ జాజుల రాము, ఎంపీటీసీ కాలచర్లనాగు, వైస్ ఎంపీపీ బొరుసు బద్రి మృతుల కుటుంబాలను పరామర్శించారు.

ఆర్థిక ఇబ్బందులతో

అక్క ఇంట్లో చెల్లి దొంగతనం

ముగ్గురిని అరెస్ట్ చేసిన నిడదవోలు పోలీసులు, రూ.12.55 లక్షల సొత్తు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

నిడదవోలు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సొంత అక్క ఇంట్లో చెల్లే దొంగతనానికి పాల్పడగా నిడదవోలు పోలీసులు ఒక్కరోజులోనే పట్టుకున్నారు. నిడదవోలు సీఐ పీవీజీ.తిలక్ తెలిపిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణం ఎంవీనగర్ సమీపంలో నివాసముంటున్న బలిజ శశి లలితాదేవి ఈనెల 10న ఇంటికి తాళం వేసుకుని తన పనిచేస్తున్న పాఠశాలకు వెళ్లిపోయింది. అదే అదునుగా తీసుకున్న లలితాదేవి సొంత చెల్లెలు తాడేపల్లిగూడెనికి చెందిన పడాల లక్ష్మీ శైలజ ఆర్థిక ఇబ్బందుల కారణంగా అక్క ఇంట్లోనే దొంగతనం చేసేందుకు ప్లాన్ చేసింది. దొంగతనంలో సహకరించేందుకు సమీప బంధువు అయిన ఉండ్రాజవరం గ్రామానికి చెందిన బండి సత్యవేణిని సహాయం కోరింది. దొంగతనంలో కూడా వాటా ఇస్తానని ఒప్పించింది. బీరువాను కట్ చేసేందుకు ఉండ్రాజవరం గ్రామానికి చెందిన కప్పకాయల సురేంద్ర సాయంతో 10వ తేదీ మధ్యాహ్నం ఇంట్లోకి ప్రవేశించి బీరువాను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి లక్ష్మీదేవి హారం, నల్లపూసల గొలుసు, చెవి బుట్టల జత, రెండు గాజులు, చెవి కమ్మల జత, చేప లాకెట్ చైన్, సాధారణ చైన్, గుళ్ళ చైన్, పాపిటబొట్టు ఇలా సుమారు 198 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు వారు దోచుకుపోయారు. ఆ వస్తువుల విలువ రూ.12 లక్షల 55 వేల ఉంటుందని సీఐ తెలిపారు. తెలిసినవారే ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారన్న అనుమానంతో ఆ కోణంలో విచారించారు. శనివారం తణుకువెళ్లి బంగారు నగలు విక్రయించేందుకు కానూరు వద్ద దొంగతనానికి పాల్పడిన ముగ్గురు కలిశారు. దీంతో వారిని అరెస్ట్ చేసి బంగారు అభరణాలు, నగదు స్వాధీనం చేసుకుని కోర్టుకు పంపామని సీఐ తెలిపారు. దొంగతనం జరిగిన ఒక్కరోజు వ్యవధిలోనే కేసును చేధించిన సీఐ తిలక్, ఎస్ఐ కె.జగన్మోహనరావు, సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

డీజే విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

బ్లేడ్లతో దాడి

ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు



గాయపడిన యువకులు

రావులపాలెం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో జరిగిన పోలేరమ్మ జాతరలో డీజే పాటల విషయంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన ఘర్షణ కారణంగా ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని పొడగట్లపల్లిలో పోలేరమ్మ జాతర సందర్భంగా డీజే సౌండ్స్ ఏర్పాటు చేశారు. డీజే వెంట శనగనపూడి దిలీప్‌కుమార్‌తో పాటు అతడి స్నేహితులు డ్యాన్స్ చేస్తున్నారు. ఆ సమయంలో సరిపెళ్ళ కిరణ్‌బాబు, కొల్లి దిలీప్, పులిదిండి వంశీ, రొక్కాల నాగరాజు, కొల్లి ప్రవీణ్‌తో పాటు మరో యువకుడు మరో పాటను ప్లే చేయ్యమని కోరగా దానికి దిలీప్‌కుమార్, స్నేహితులు నిరాకరించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ ఏర్పడింది. దిలీప్‌కుమార్, స్నేహితులపై ఆరుగురు బ్లేడ్లతో దాడి చేశారు. దీంతో దిలీప్‌కుమార్, కుసంపూడి జ్యోతి శివసాయిప్రకాష్ పృథ్వీరాజ్‌కు తీవ్ర గాయాలు కావడంతో కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాము తెలిపారు.

ముగిసిన నది సినిమా షూటింగ్


సినిమా షూటింగ్‌లో మహర్షి ఉద్భా, నాజర్

మోతుగూడెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో నది చిత్ర బృందం 38రోజుల పాటు చేసిన షూటింగ్ ముగిసింది. ఈ చిత్రంలో హీరోగా మహర్షి ఉద్భా ముఖ్య పాత్రలో నటుడు నాజర్ నటించారు. కొన్ని సన్నివేశాలు డొంకరాయి డ్యాంపక్కన, కూనవరం, వీఆర్‌పురంలో తీశారు. ఈ సినిమాకు డైరెక్టర్ ఆదిత్య వెంపాటి కాగా నిర్మాతలు బ్రైడన్ బెంట్, కృష్ణ మామిడి.

పోగొట్టుకున్న బ్యాగు అందజేత

తుని రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న ప్రయాణికుల బ్యాగును రైల్వే పోలీసులు అందజేశారు. తునికి చెందిన తూనికుంట్ల లలిత, ఫణికుమార్‌లు తమ బ్యాగు తుని రైల్వేస్టేషన్ పరిధిలో పోగొట్టుకుని ఉండడంతో బ్యాగుని రైల్వే పోలీసులు కనుగొని బ్యాగులో గల 36 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు రూ.3లక్షల నగదును పోలీసులు అందజేశారు.

ఉత్సాహంగా...

చేబ్రోలులో రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు

సీనియర్స్ విజేత కొవ్వాడ

జూనియర్స్ విజేత వడిశలేరు




పోటీలో పరుగులు తీస్తున్న ఎడ్లు


సీనియర్స్ విజేతకు బహుమతి ప్రదానం


జూనియర్స్ విజేతకు బహుమతి అందజేత

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. సీతారామస్వామి ఆలయ కమిటీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అనకాపల్లి, బాపట్ల, కృష్ణా, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలు, తెలంగాణాలోని హైదరాబాద్ నుంచి ఎడ్ల జతలు తరలివచ్చాయి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం పక్కనే ఉన్న పుంతరోడ్డులో నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్స్ విజేతలకు ఓదూరి నాగేశ్వరరావు, కిషోర్‌లు, చేదులూరి దత్తుడు, గవర్రాజు, సారిపల్లి లోవరాజులు.. జూనియర్స్ విజేతలకు అల్లం దొరబాబు, ఓరుగంటి చిన్ని, సారిపల్లి శ్రీను, కర్రి చిట్టిబాబు నగదు పురస్కారాలు, షీల్డులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా యనమల కృష్ణుడు, సిద్దా నానాజీ, సామర్లకోట రామకృష్ణ వ్యవహరించారు.

విజేతలు వీరే

సీనియర్స్ విభాగంలో నిర్దేశించిన దూరాన్ని కాకినాడ జిల్లా కొవ్వాడ మట్టా నవనీత్ శ్రీ మణికంఠకు చెందిన ఎడ్ల జత 6 నిమిషాల 56సెకన్ల 78 పాయింట్ల సమయంలో పరుగెత్తి ప్రథమస్థానంలో నిలవగా, కోనసీమ జిల్లా గుమ్మిలేరు కోరా తేజ చౌదరి ఎడ్ల జత 7-01-28 సమయంలో, మండపేట వేగుళ్ల తేజ చౌదరి ఎడ్ల జత 7-08-09సమయంలో పరుగెత్తి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. జూనియర్స్ విభాగంలో తూర్పుగోదావరి జిల్లా వడిశలేరు సిద్ధి వినాయక ధరణి శ్రీనివాస్‌కు చెందిన ఎడ్ల జత 4-42-65 సమయంలో పరుగెత్తి తొలి స్థానం సాధించగా, హైదరాబాద్‌కు చెందిన కె.సతీష్ ఎడ్లజత 4-45-09 సమయంలో, కాకినాడ జిల్లా గొల్లప్రోలు నిమ్మకాయల నూకరాజు ఎడ్ల జత 4-48-40, వన్నెపూడి బవిరిశెట్టి మణికి చెందిన ఎడ్ల జత 4-50-56 సమయంలో పరుగెత్తి వరుసగా 2, 3, 4 స్థానాల్లో నిలిచాయి.

నేడు వెలుగుబందలో...

రాజానగరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుగుబందలో గ్రామదేవత శ్రీసత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 13న కూటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు రౌండ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో తొలిసారిగా రౌండ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ పోటీలను జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ప్రారంభిస్తారన్నారు. వివరాలకు 9000662999లో సంప్రదించాలని కోరారు.

త్రివిధ దళాలు.. అదిరే విన్యాసాలు

కాకినాడ సముద్రతీరంలో

ఆరో రోజు 'టైగర్ ట్రయింఫ్ -2025'

భూమి, సముద్రం, ఆకాశంలో ప్రదర్శనలు






సాగరతీరంలో విన్యాసాల దృశ్యాలు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సముద్రతీరంలో గత 6 రోజులుగా నిర్వహిస్తున్న టైగర్ ట్రయింఫ్ విన్యాసాలు ఆకట్టుకుంటున్నాయి. భారత్- అమెరికా దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తోన్న టైగర్ ట్రంప్ విన్యాసాల్లో భాగంగా శనివారం ఇరుదేశాల త్రివిధ దళాలు పోటాపోటీగా భూభాగం, సముద్రం, ఆకాశంలో విన్యాసాలు నిర్వహించాయి. సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో టైగర్ ట్రయింఫ్-2025లో భాగంగా భారత్-అమెరికా యంపీబియస్ విన్యాసాల్లో ఇరుదేశాలకు చెందిన సుమారు 1000 మంది త్రివిధ దళాల సభ్యులు పాల్గొన్నారు. ముఖ్యంగా యుద్ధ సమయంతో పాటూ తుఫాన్లు, విపత్తుల వేళ అనుసరించాల్సిన వ్యూహం, అందించే సహాయ పునరావాస సమయాల్లో ఏ కార్యక్రమాలు చేస్తారో ఇరుదేశాల సైనిక దళాలు ప్రదర్శించారు. హోవర్ క్రాఫ్టులు, యుద్ధ ట్యాంకులు, యుద్ధ హెలికాప్టర్లు వినియోగం, భద్రత, అత్యాధునిక ఆయుధాలను వినియోగించే శత్రుదేశాలపై ఎలా దాడులు చేస్తారో సంయుక్తంగా విన్యాసాలు చేశారు. యుద్ధ సమయాల్లో గాయడిన త్రివిధ దళాల సభ్యులకు ఏ విధంగా ప్రథమ చికిత్స, వైద్య సేవలు తదితర వాటిపై ప్రదర్శించారు. శనివారంతో యుద్ధ విన్యాసాలు ముగిసినట్టేనని భావిస్తున్నారు.

వడగాల్పులు వర్షపు చినుకులు





ఎండలు మండిపోతున్నాయి. రాజమహేంద్రవరంలో శనివారం మధ్యాహ్నం తీవ్ర వడగాల్పులకు ప్రజలు అపసోపాలు పడ్డారు. అయితే సాయంత్రం అకస్మాత్తుగా వర్షం రావడంతో ఎంతో ఉపశమనం పొందారు.

ఫొటోగ్రాఫర్- రాజమహేంద్రవరం

అన్నవరం దేవస్థానం కొండపై...

మహిళ మెడలో బంగారం చోరీ


చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రత్తిపాడు సీఐ, అన్నవరం ఎస్ఐ

అన్నవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం కొండపై ఒక వివాహానికి హాజరైన మహిళ మెడలో బంగారు హారం, నెక్లెస్‌ను ఇద్దరు దుండగులు అపహరించుకుపోయారు. రంగంపేట మండలం కోటపాడు గ్రామానికి చెందిన మహిళ అన్నవరం దేవస్థానంలో వివాహానికి హాజరయ్యారు. శుక్రవారం రాత్రి సత్యగిరి జంక్షన్ వద్ద తమ బృందంతో ఎదురుచూస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని వస్తువులు తెంచుకునిపోయారు. వాటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. సంఘటన ప్రాంతాన్ని శనివారం ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు, అన్నవరం ఎస్ఐ హరిబాబు పరిశీలించి కమాండ్‌కంట్రోల్ రూంలో సీసీ ఫుటేజీ ఆధారంగా కొన్ని గుర్తులు గుర్తించారు. ఫుటేజీ క్లారిటీగా లేదని, సంఘటన జరిగిన ప్రాంతంలో వెలుగు లేకపోవడంతో దుండగులు రెక్కీ నిర్వహించి దాడికి పాల్పడినట్టు భావిస్తున్నామన్నారు.

మనస్తాపంతో ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

విఆర్‌పురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురై బాలిక ఉరి వేసుకుని మృతిచెందింది. బాలిక తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. 2నెలల క్రితం ఏడుగురాళ్ల పల్లి పంచాయతీ బాయిబొక్క గ్రామం నుంచి కూలీ పనుల కోసం జీడిగుప్ప గ్రామానికి కొండా కుంచమ్మ (15), తల్లి బుల్లెమ్మ వచ్చారు. వారం రోజుల నుంచి ఇంటికి వెళదామంటూ మారాం చేస్తూ పనికి వెళ్లకుండా మకాం దగ్గరే ఉంటుంది. గురువారం తల్లి బుల్లెమ్మ కూలీ పనికి వెళ్లి సాయంత్రం వచ్చి చూస్తే కుంచమ్మ లేదు. చుట్టుపక్కల వెతుకుతుండగా చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించింది. ఈ విషయాన్ని గురువారం రాత్రి పోలీసులకు బుల్లెమ్మ తెలపడంతో వీఆర్‌పురం ఎస్ఐ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. శుక్రవారం కోతులగుట్ట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుంచమ్మ మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్...

ఇద్దరి అరెస్టు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణం రామదుర్గావీధిలో క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో రామదుర్గావీధిలో 2 అంతస్థుల భవనాన్ని కోనాల శ్రీనివాసరెడ్డి 2 సంవత్సరాల క్రితం అద్దెకు తీసుకుని క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. బెట్టింగ్‌కు కావలసిన టీవీ, ల్యాప్‌ట్యాప్, ఫోన్లు ఏర్పాటు చేసుకుని సహాయకుడిగా మా చవరానికి చెందిన రాళ్ల నాగబాబును నెలకు రూ.15వేలు జీతానికి నియమించుకున్నాడు. బెట్టింగులో వచ్చిన లాభాలను జల్సాలకు వాడుకుంటున్నాడు. ఈ మేరకు ఎస్ఐకు వచ్చినసమాచారంతో డీఎస్పీ రఘువీర్ పర్యవేక్షణలో సీఐ ఎం. వెంకటనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 10.30 గంటలకు ఎస్ఐ నాగేశ్వరరావు సిబ్బందితో దాడిచేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.50వేల నగదు, 9 సెల్‌ఫోన్లు, 1 ల్యాప్‌టాప్, టీవీసెట్, సెట్‌టాప్ బాక్సు, జియో ఫైబర్‌బాక్సు, సుజుకీ మోటారు సైకిల్ సీజ్ చేసి కేసు నమోదు చేశారు. కోనాల శ్రీనివాసరెడ్డి, రాళ్ల నాగబాబును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు. క్రికెట్ బెట్టింగ్‌పై ఏ విధమైన సమాచారం తెలిసినా డీఎస్పీ 9440796507, సీఐ 9440796536, ఎస్ఐ 9440796589 నెంబర్లలో తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

పూలే, అంబేడ్కర్ అవార్డుల ప్రదానం



ఆదిరెడ్డి అప్పారావు వీర రాఘవమ్మ దంపతులను, జేబీ రాజును సత్కరిస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుకు మహాత్మా జ్యోతిరావు పూలే అవార్డు, దళిత సేన ఉభయ తెలుగురాష్ట్రాల నేత జేబీ రాజుకు బీఆర్ అంబేడ్కర్ అవార్డుల ప్రదానం జరిగింది. రాజమహేంద్రవరం చెరుకూరి కళ్యాణ మండపంలో శనివారం రాత్రి రాష్ట్ర బీసీ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవ సభకు అతిథులుగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ మంత్రి జవహర్, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర విచ్చేశారు. తొలుత జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే వాసు మాట్లాడారు. ఇద్దరు మహనీయులతో పేరుతో అవార్డులు ప్రదానం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ఆదిరెడ్డి అప్పారావు , వీర రాఘవమ్మ దంపతులను సత్కరించి పూలే అవార్డును, జేబీ రాజును సత్కరించి అంబేడ్కర్ అవార్డును ప్రదానం చేశారు. తొలుత జేబీ రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనతోనే తన పయనం ఉంటుందన్నారు. ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ పూలే విద్యకు ప్రాధాన్యమిచ్చారని, ఆయన స్ఫూర్తితోనే తాను ముందుకు సాగుతున్నానన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈ కె.తిలక్‌కుమార్ రిటైర్డ్ అధ్యాపకుడు కరుటూరి బెన్‌సన్‌రావు, సంఘం చైర్మన్ గుమ్మడి సమర్పణరావు, వైస్ చైర్మన్ ఎల్వి ప్రసాద్, కార్యదర్శి అసదుల్లా అహ్మద్, రాచర్ల నాగేశ్వరరావు, కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు జార్జీ అంటోని తదితరలు పాల్గొన్నారు.

పేదల భూములపై పెద్దలు కన్నేసి ఆక్రమించారు

ఫీల్డ్‌లేబర్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ రామారావు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో తమ సొసైటీ సభ్యులకు 1976లో ప్రభుత్వం ఇచ్చిన 29 ఎకరాల స్థలాన్ని కొందరు పెద్దలు నకిలీ డాక్యుమెంట్లతో ఆక్రమించి తమపై దౌర్జన్యం చేస్తున్నారని ఎక్స్‌తాడిటపర్స్ ఫీల్డ్‌లేబర్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటి చైర్మన్ తీగిరెడ్డి వెంకట రామారావు ఆవేదన వ్యక్తం చేసారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తమకు కేటాయించిన 29 ఎకరాలు స్థానిక ఎస్వీ జనరల్ మార్కెట్ పక్కన ఉందని దానిని కొందరు పెద్దలు ఆక్రమించుకుని నకిలీ డాక్యుమెంట్లతో ప్రైవేట్ భూమిగా చూపిస్తున్నారన్నారు. తమపై కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ అనే వ్యక్తి ఈ భూముల విషయంలో తమపై దౌర్జన్యం చేస్తున్నాడన్నారు. ఈ భూములను ఆక్రమించిన వారిపై కోర్టుకు వెళితే 1994లో ఫైనల్ జడ్జిమెంట్ వచ్చిందన్నారు. ఇదే భూములపై 1999లో అప్పటి ఆర్డీవో శ్రీధర్ విచారణ జరిగి ఈ భూములు అసైన్డ్ భూములని నివేదిక ఇచ్చారని అయినా పెద్దలు తమ భూమిని వదలడం లేదని చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి స్పందించి తమ భూములు తమకు చెందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. సమావేశంలో సొసైటీ సభ్యులు వాసంశెట్టి దుర్గ, జి.ముత్యాలు, నరికుర్తి సురేష్, వాసంశెట్టి జీవరత్నం, బొందెల వెంకన్న, పోశెట్టి రాము, గొడి లక్ష్మి, రేసి రాజు, వై.నాగన్న పాల్గొన్నారు.

మర్రిపూడిలో 32 జట్లతో క్రికెట్ పోటీలు

రంగంపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మర్రిపూడి లాంటి చిన్న గ్రామంలో 32 జట్లతో క్రికెట్ పోటీలు జరగటం అభినందనీయమని, క్రికెట్ ఆటపై క్రీడాకారులకు ఉన్న ఆదరణ దీనికి కారణమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎత్తిపోతల సమాఖ్య అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి అన్నారు. శనివారం రంగంపేట మండలం మర్రిపూడి గ్రామంలో ఎం.ఎస్.ఎస్.ఫ్రెండ్స్‌సర్కిల్ ఆధ్వర్యంలో జరిగే పోటీలను ఆయన ప్రారంభించారు. 20 గ్రామాల నుంచి 32 జట్లు పాల్గొనే ఈ పోటీలు ఈ నెల 28 వరకు జరుగుతాయన్నారు.

కుతుకులూరులో చలివేంద్రం

అనపర్తి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత పెరుగుతున్న తరుణంలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కుతుకులూరు గ్రామంలో శంఖు చక్రదర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శంఖు చక్రదర ట్రస్టును ఆదర్శంగా తీసుకుని నియోజకవర్గంలో మరిన్ని చలివేంద్రాలు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమ తులసి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు కిందకు వేలాడడంతోనే ప్రమాదం

కాపవరంలో విద్యుత్ షాక్ ఘటనపై మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కాపవరంలో విద్యుత్ వైర్లు కిందకు వేలాడడంతోనే షార్ట్ సర్క్యూట్ జరిగిందని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆరోపించారు. ప్రమాదంలో బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని,విద్యుత్ శాఖ, రైస్‌మిల్లు యాజమాన్యం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శనివారం కాపవరంలో సూర్యమహాలక్ష్మి రైస్ మిల్లు సమీపంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురి కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ సంఘటన చాలా బాధాకరమని, ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. ఈ సంఘటనపై ప్రభుత్వం, విద్యుత్‌శాఖ, రైస్‌మిల్లు యాజమాన్యం పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడెక్కడ వైర్లు కిందకు వేలాడుతున్నాయో వాటి అన్నింటిని గుర్తించి పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా రాజా వెంట వైస్ ఎంపీపీ బొరుసుబద్రి, ఐల శ్రీను తదితరులున్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ర్యాలీ

కడియం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం మండల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం కడియంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ఐవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కలీముల్లా ఖాన్ మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టు 8న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును యావత్ భారత్ ముస్లిం మైనారిటీ సమాజం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ బిల్లు మునుగులో ముస్లిం మైనారిటీల సంక్షేమానికి సంబంధించిన ఆస్తులను, మస్‌జిద్‌లను, శ్మశానవాటికలను కేంద్ర ప్రభుత్వం లాక్కొనేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో షేక్ సలీం, ఐవైఎం జిల్లా బాధ్యులు షేక్ చాన్‌భాషా, షేక్ సర్కార్‌భాషా, ఎండీ దాదాషరీఫ్, షేక్ సిలార్, జునైద్, అబులాల జైద్ పాల్గొన్నారు.

నన్నయ వీసీకి రత్నసింంహ్‌జీ మహీదా అవార్డు



అవార్డు అందుకుంటున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీని గుజరాత్ సీఎం భూపేంద్రభాయ్ పటేల్ రత్నసింంహ్‌జీ మహీదా మెమోరియల్ అవార్డుతో సత్కరించారు. గుజరాత్‌లోని నర్మదా జిల్లాలోని రాజ్‌పిప్లాలో ప్రతిష్ఠాత్మక సామాజిక సంస్కర్త, విద్యావేత్త, గిరిజనుల సంక్షేమానికి అంకితం చేయబడిన రత్నసింగ్‌జీ మహీదా జ్ఞాపకార్థం ఈ అవార్డు అందజేశారు. దేశవ్యాప్తంగా గిరిజన అభివృద్ధికి కృషిచేసిన ఇద్దరు ప్రముఖ వ్యక్తులకు అవార్డులు అందించారు. వారిలో 19 గిరిజన భాషలకు లిపిని రూపొందించిన నన్నయ వీసీ ప్రసన్నశ్రీ, బిర్సాముండా గిరిజన విశ్వవిద్యాలయం వీసీ మధుకర్బాయ్ ఎస్. పద్విలకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంబగా ప్రసన్నశ్రీ మాట్లాడుతూ తాను ఈ అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, తన బాధ్యతను మరింత గుర్తు చేస్తుందన్నారు. రత్నసింంహ్‌జీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తానని, గిరిజనాభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. అవార్డు అందుకున్న ప్రసన్నశ్రీకి విశ్వవిద్యాలయ అధికార్లు, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

మిర్తిపాడులో ఫ్లెక్సీల ధ్వంసంపై నిరసన

సీతానగరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్తిపాడు గ్రామంలోని వైసీపీకి చెందిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని కొంతమంది వ్యక్తులు ధ్వంసం చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు టెంట్ వేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇతర పార్టీల ఫ్లెక్సీలు బాగానే ఉన్నాయని, వైసీపీ ఫ్లెక్సీలను మాత్రమే ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న కోరుకొండ ఇన్‌చార్జి సీఐ శ్రీధర్, స్థానిక ఎస్ఐ డి.రామ్‌కుమార్ మిర్తిపాడు చేరుకుని టెంట్ తొలగించాలని కోరారు. వైసీపీ నాయకులతో చర్చలు జరిపి ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కాగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. అనంతరం వైసీపీ సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబుతో కలసి గ్రామ నాయకులు కార్యకర్తలు సీతానగరం పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఇంటర్ ఫలితాల్లో

విద్యార్థుల ప్రతిభ

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



ఎస్.వీరహాసిని, సీహెచ్.మాధవి, డి.సోహిత, ఏవీడీ ప్రసాద్,



ఆర్. లీలాశ్రావణి, కె.విజయ్‌కుమార్, సీహెచ్ సంతోష్, కె.చరణ్‌తేజ, ఆర్ఎల్ భగవతి

రంగంపేట, ఏప్రిల్, 12 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ శనివారం తెలిపారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా అత్యధిక మార్కులు సాధించారన్నారు. సెకండ్ ఇయర్‌లో 86 మందికి గాను 62 మంది ఉత్తీర్ణులై 75శాతం, ఫస్టియర్‌లో 123 మందికి 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 50శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. సీనియర్ ఎంపీసీలో ఎన్.వీరహాసిని 969, బైపీసీలో సీహెచ్ మాధవి 961, హెచ్‌ఈసీలో డి.సోహిత, 925, సీఈసీలో ఏవీ దుర్గాప్రసాద్ 901 మార్కులు సాధించారని, ఫస్టియర్‌లో ఎంపీసీలో ఎస్.దివ్య 449, బైపీసీలో కె.శ్రీనాగలక్ష్మి 427, సీఈసీలో డి.లోవరాజు 462, హెచ్‌ఈసీలో పి.దుర్గాప్రసాద్ 317 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడానికి కృషి చేసిన అధ్యాపకులను ప్రిన్సిపాల్ అభినందించారు.

పందలపాక జడ్పీ ప్లస్‌లో 75శాతం

బిక్కవోలు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పందలపాక జడ్పీ ప్లస్ పాఠశాలలో ఇంటర్ పరీక్షా ఫలితాల్లో సీఈసీ సెకండియర్‌లో 75శాతం ఉత్తీర్ణత సాధించినట్టు హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొత్తం 8మంది విద్యార్థినులు పరీక్ష రాయగా ఆరుగురు పాసయ్యారని, వీరిలో ఆర్.లీలాశ్రావణి 943 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. ఎంపీసీ నుంచి ఏడుగురు హాజరుకాగా నలుగురు పాసయ్యారని, వీరిలో పి.దేవి 926 మార్కులు సాధించినట్టు చెప్పారు. ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీ నుంచి ఆరుగురు హాజరుకాగా ఒక్కరూ పాసవ్వలేదని, సీఈసీ నుంచి 17 మంది హాజరు కాగా ముగ్గురు పాసయ్యారన్నారు. బిక్కవోలు జడ్పీ ప్లస్ పాఠశాలలో ఈ ఏడాదే ఇంటర్ ప్రారంభించారని, సీఈసీ గ్రూపు నుంచి ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 16 మంది హాజరు కాగా ఒక్కరే పాసయ్యారని హెచ్ఎం పి.వీరప్రభాకరరావు తెలిపారు.

గోకవరంలో 58శాతం..

గోకవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి సీనియర్ ఇంటర్‌లో 158 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 92మంది(58.22) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థి కొత్తూరి విజయ్ కుమార్(బైపీసీ) 979 మార్కులు, ఎల్.హిందు అనిష్క(ఎంపీసీ) 931 మార్కులు, యాదల విజయ్‌గీత(సీఈసీ) 871 మార్కులు, కొమరం స్వర్ణలత(హెచ్ఈసీ) 849 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ కె.ఎస్.సుధాకరరెడ్డి తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 214 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 63మంది(29.43) ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరిలో ఎన్.నాగసూర్యచక్ర(ఎంపీసీ) 455 మార్కులు సాధించినట్టు చెప్పారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కామరాజుపేట హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు మరిచెట్ల హరికా నాగసాయి 924 మార్కులు, కొప్పుల ప్రణీత 903 మార్కులు, ఫస్టియర్ ఫలితాల్లో పెనుగొండ సత్యసూర్యశ్రీ 410 మార్కులు, గౌతు శ్రీలక్ష్మి 403 మార్కులు సాధించినట్టు ప్రధానోపాధ్యాయురాలు ఈశ్వరిదేవి తెలిపారు.

సీతానగరంలో 70శాతం..

సీతానగరం,ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్‌లో 70శాతం ఉత్తీర్ణత సాధించామని ప్రిన్సిపాల్ చిక్కం దొరబాబు తెలిపారు. ఫస్టియర్ పరీక్షలు రాసిన 163 మంది విద్యార్థుల్లో 68 మంది(42శాతం) ఉత్తీర్ణులయ్యారన్నారు. సెకండియర్ విద్యార్థులు 93 మంది పరీక్షలకు హాజరై కాగా 65 మంది(69.89శాతం) ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఒకేషనల్‌లో ఎంఏటీ గ్రూప్ విద్యార్థి బి.మోహన్ 948 మార్కులు, సీఈటీ గ్రూప్ విద్యార్థి టి.కిరణ్‌కుమార్ 974 మార్కులు, ఓఏఎస్ గ్రూప్ విద్యార్థిని సీహెచ్ దేవి 823 మార్కులు సాధించినట్టు తెలిపారు. అలాగే జనరల్ గ్రూపుల్లో ఎంపీసీ విద్యార్థిని వై.ప్రసన్న తేజస్విని 887 మార్కులు, సీఈసీలో ఆళ్ల క్రాంతి 981మార్కులు, బైపీసీలో బి.లలితాదేవి 869 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ దొరబాబు పేర్కొన్నారు.

సత్తాచాటిన గురుకుల విద్యార్థులు

అనపర్తి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో అనపర్తి కొత్తూరు సెంటినరీ గురుకుల కళాశాల, ఎల్ఎన్‌పురం రెసిడెన్సియల్ గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎల్ఎన్‌పురం ద్వితీయ సంవత్సరంలో 16 మందికి 16 మంది ఉత్తీర్ణులు కాగా ఫస్టియర్‌లో 44మందికి 30 ఉత్తీర్ణులయ్యారు. కొత్తూరు సెంటినరీ కళాశాలలో సెకండియర్ 107మందికి 99మంది ఉత్తీర్ణులు కాగా ఫస్టియర్‌లో 116మందికి 99 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అనపర్తిలో జడ్పీ ప్లస్ హైస్కూల్లో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షకు 40 మంది హాజరుకాగా 12మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. కుతుకులూరు జూనియర్ కళాశాలలో సెకండియర్‌లో 9 మందికి 9మందీ ఫెయిలయ్యారు. మొదటి సంవత్సర పరీక్షలకు 11 మంది హాజరుకాగా ఒక్కరు మాత్రమే ఉత్తీర్ణుడయ్యాడు.

కోరుకొండలో 75శాతం..

కోరుకొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీకల్లో 75శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్, ఆర్‌జేడీ ఐ.శారద, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.రామచంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 53శాతం, సీనియర్ ఇంటర్‌లో 75శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో ఆర్ఎల్ భగవతి 987 మార్కులు, వి.రమ్య 974 మార్కులు, ఎంపీసీలో ఎస్.ధనలక్ష్మి 952 మార్కులు, ఎస్.మహేశ్వరి 949 మార్కులు, హెచ్ఈసీలో డి.వెంకటలక్ష్మి 920 మార్కులు, సీఈసీలో బొల్లు కావేరి 758 మార్కులు, సీటీలో సూలెం శ్రీరాం 826 మార్కులు, ఏటీలో డి.కౌసల్య 892 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్టు చెప్పారు.



బి.రమ్య, టి.వెంకటలక్ష్మి

సత్తాచాటిన నారాయణ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో రాజమహేంద్రవరం నారాయణ విద్యార్థులు జూనియర్ ఎంపీసీలో 100శాతం, బైపీసీలో 99.6శాతం ఉత్తీర్ణత సాధించామని డీన్ డి.హనుమంతరావు తెలిపారు. జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను కీసా సుకైన ఆలీ 464 మార్కులు, నవ్యశ్రీదేవి 464, మహేశ్వరీ కట్టా 464, పూజా వీనీల బత్తిన 464, బైపీసీలో 440 మార్కులకు గాను దాట్ల వర్షిణి 434, ఎం.జాహ్నవి 434, బి.సంజన 432, ఎంఎస్ఎల్ షణ్ముఖ సాయి మల్లిమొగ్గల 430, డి.భవిష్య 430, పులగం రితికా స్వామిరెడ్డి 430, నాగ హర్షిత జోన్నాడ 430 మార్కులు సాధించారని తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో వేయి మార్కులకు ఎంపీసీలో నాగ మహేశ్వరి పడాల 989, డీఎస్ఎల్ శరణ్ 989, శ్రవణ యశస్విని వారణాసి 987, సీహెచ్ఎల్ ఫణిశృతి 987, శైలజా కర్రి 985, బైపీసీలో గుణదీపక కణితి 986,హేమ కృష్ణశ్రీ కొప్పాక 986, చాతుర్య కరణం 985, ప్రవళిక కుమారి జుట్టా 985, నవ్యశ్రీ తాతపూడి 981, పెద్దింటి ఇందిరా శ్రీహర్షిత 980 సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను డీజీఎం ఎస్‌జే స్టాలిన్, డీన్ ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్స్ గీతారాణి, కె.దుర్గా శ్రీను, డి.వెంకన్నబాబు అభినందించారు.

ఆవ ముంపు శాశ్వత నివారణకు చర్యలు

» ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
» రూ.3.80 కోట్లతో పంపుహౌస్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం/రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రూరల్‌లోని గ్రామాలు వర్షాకాలంలో గోదావరి వరదల వల్ల ఆవ ఛానల్‌లోని మురుగునీరు గోదావరిలో కలవగా ముంపునకు గురి కాకుండా ఇక్కడ పంపుహౌస్ నిర్మించి శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని, వరదల సీజన్ నాటికి పంపుహౌస్ నిర్మాణ పనులు పూర్తవుతాయని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. వరదల సమయంలో రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని హుక్కుంపేట, నేతాజీ నగర్, రామకృష్ణానగర్ తదితర ప్రాంతాలు ఆవ ఛానల్ ద్వారా ముంపునకు గురి కాకుండా ఉండే విధంగా ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద కాల్వలో నీటిని తోడి పోయడానికి రూ.3.80 కోట్లతో నిర్మించే పంపుహౌస్‌కు ఎమ్మెల్యే గోరంట్ల శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటిపడిపోయిందని కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. రూరల్ మండలంలో కోట్లాది రూపాయలతో నాణ్యతతో కూడిన సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే వాటర్ గ్రిడ్ ఏర్పాటుచేసి ఇంటింటికీ కుళాయి ద్వారా గోదావరి నీటిని అందజేస్తామన్నారు. గోదావరిలో కలుషిత నీరు కలవకుండా 50 ఎంఎల్‌డీ, 5ఎంఎల్‌డీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు ఏర్పాటు చేశామని, రూ.12 కోట్లతో రాజమహేంద్రవరం నుంచి డ్రైన్ నిర్మించి ఆ మురుగునీటిని బ్యారేజీ దిగువున ఉన్న లంకల్లోకి పైపులైన్ ద్వారా తరలిస్తామన్నారు. గ్రామాల్లో డ్రైన్ నిర్మాణానికి మరో రూ.2.8 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పుష్కరాల నాటికి గోదావరి బండ్ రోడ్డును అభివృద్ధి చేయనున్నామన్నారు. అలాగే హుకుంపేట రామకృష్ణానగర్‌లో రూ.1.37 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులకు గోరంట్ల రవిరామ్ కిరణ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఈఈ ఎస్‌కే మదార్ష ఆలీ, డీఈ విరూపాక్షిరావు, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, టీడీపీ మండలాధ్యక్షుడు ఎం.శివసత్యప్రసాద్, పండూరి అప్పారావు, ఆళ్ళ ఆనందరావు, తలారి మూర్తి, సావాడ శ్రీనివాసరెడ్డి, బత్తిన ఏడుకొండలు, యడ్ల మహేష్, గుర్రాల వెంకట్రావు, ఒంటెద్దు స్వామి పాల్గొన్నారు.

'నిడదవోలు'ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

» పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్



ముత్యాలమ్మకు నగలు, వెండి కిరీటం తీసుకొస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిడదవోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో జనసేనలో చేరిన కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రవేశపెట్టనున్న చైర్మన్‌పై అవిశ్వాసానికి కూడా అవకాశం లేకుండా కౌన్సిల్ జనసేన వశం కావడంపై హర్షం వ్యక్తంచేస్తూ కేక్ కట్ చేశారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో అందరి ఆదరాభిమానాలను పొందుతూ జనసేన బలోపేతం అవుతోందన్నారు. నిడదవోలు అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి వైసీపీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు జనసేనలో చేరడం అభినందనీయమన్నారు. నిడదవోలు పట్టణాన్ని రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, పువ్వల రతీదేవి, చిలకల శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న మంత్రి

రంగంపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో శనివారం శ్రీ ముత్యాలమ్మ జాతర ఘనంగా జరిగింది. మంత్రి కందుల దుర్గేష్.. అమ్మవారికి అలంకరించేందుకు నగలు, వెండి కిరీటం తీసుకొచ్చారు.అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అడబాల మణికంఠ, బీజేపీ మండలాధ్యక్షుడు ఎం.సాయిరామ్, కొండేపూడి నాని, జనసేన నాయకులు సత్తిబాబు, యానాల కొండ, టీడీపీ నాయకుడు యలమాటి సుధాకర్, సర్పంచ్ అడబాల మరిడియ్యకాపు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీలో గోవుల మరణాలపై అసత్య ప్రచారం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలోని గోశాలలో గోవుల మరణాలపై అసత్య ప్రచారం తగదని, ఈ విషయంలో భూమన కరుణాకరరెడ్డి మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర చేస్తున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో అన్నారు. ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గోశాలలో ఆవులు వృద్ధాప్యం, డెలివరీ సమయంలో వ్యాధులతో నెలకు సగటున 10 ఆవులు మృత్యువాత పడుతుంటాయని గత ఐదేళ్ల గణాంకాలు చూస్తే స్పష్టమౌతుందన్నారు. కరుణాకర్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ప్లాస్మా టీవీలు, తాళిబొట్టుల కుంభకోణాలు, టిక్కెట్లు అమ్ముకోవడం, డాలర్లు మాయం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని, తిరుపతి కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించింది, టీటీడీని ప్రైవేట్‌పరం చేయాలని ప్రయత్నించింది కరుణాకర్ కాదా అని మండిపడ్డారు.

చిన్నారి శివన్‌కు ఎమ్మెల్యే అభినందన

అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డులలో స్థానం సంపాదించిన మూడేళ్ల 9 నెలలు వయసున్న చిన్నారి నిశితాశివన్‌ను ఎమ్మెల్యే వాసు, నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్‌కార్గ్ అభినందించారు. శివన్ రాష్ట్రాలు, వాటి రాజధానులు, జాతీయ చిహ్నాలు, ఖండాలు, శరీరభాగాలు, రవాణా పరికరాలు, ఆంగ్ల అక్షరాలు, జంతువులు, సిగ్నల్‌లైట్లు, రుతువులు, పండ్ల పేర్లను అతిసునాయాసంగా చెప్పి ఈ 2 రికార్డులను సొంతం చేసుకున్నాడు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ 107 సర్వీస్ క్యాంప్‌ను దానవాయిపేట ఆర్ఎస్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వద్ద సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కె.రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసి ఎమ్మెల్యే వాసు నలుగురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేశారు. ఏజెన్సీలోని మారుమూల సుమారు 86 గ్రామాల్లో స్వేచ్ఛ సొసైటీ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకురాలు స్వాతి, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, పి.చిన్ని, బత్తు శ్రీనివాస్, పద్మరాజు, రమీజుద్దీన్, భవన్‌కృష్ణ, రామానుజం పాల్గొన్నారు.

వైభవంగా చక్రస్నానం

ధవళేశ్వరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగాశనివారం రామపాదల ఘాట్ వద్ద భక్తులు చక్రస్నానాన్ని ఆచరించారు. ఉదయం ఆలయం వద్ద స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి పవిత్ర గోదావరి నదీ తీరానికి తీసుకువచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై ఆశీనులు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి చక్రస్నాన మహోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో పవళింపు సేవ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


40 లీటర్ల సారా స్వాధీనం

రంగంపేట,ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాకినాడ డిప్యూటీ కమీషనర్ సిహెచ్ చైతన్య మురళి ఆధ్వర్యంలో రంగంపేట మండలం మర్రిపూడి గ్రామంలో శనివారం నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించి 40 లీటర్ల సారాను, 1600 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకొని, వేము వెంకటరమణ,దాసరి దుర్గారావు, మట్ట శ్రీనులపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీ.ఐ సుధ తెలిపారు. బెల్లపుఊటను అదే స్థలంలో ధ్వంసం చేసామని, ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్.ఐ దుర్గాప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారని సీ.ఐ. తెలిపారు.

16న చినకొండేపూడిలో ఉచిత మెగా వైద్య శిబిరం

కడలి వెంకటేశ్వరరావు

సీతానగరం, ఏప్రిల్ 12: బత్తుల బలరామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 16న చినకొండేపూడి జీవీకె ఫంక్షన్ హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు జనసేన పార్టీ ప్రోగ్రామ్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, మాజీ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం చినకొండేపూడి జీవీకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బత్తుల బలరామ కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ నెల 16న నిర్వహించనున్న ఉత మెగా వైద్య శిబిరంలో మొబైల్ మెడికల్ వ్యాన్ ద్వారా ప్రత్యేక క్యాన్సర్ వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించన్నుట్టు పేర్కొన్నారు.



అదరగొట్టారు

ఇంటర్ ఫలితాల్లో 'తూర్పు'నకు నాలుగో స్థానం

గత ఏడాది కంటే మెరుగు

పదేళ్లలో అత్యధిక పాస్ నమోదు

ప్రథమ సంవత్సరం 77%, ద్వితీయ సంవత్సరం 87% ఉత్తీర్ణత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో తూర్పు గోదావరి జిల్లా విద్యార్థులు అదరగొట్టారు. గత పదేళ్లలో ఎప్పుడూ లేని మెరుగైన ఫలితాలను నమోదు చేశారు. ద్వితీయ సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. కేవలం 2% తేడాతో మూడో స్థానం చేజారింది. సెకండియర్‌లో 17,575 మంది పరీక్షలు రాయగా 15,362 మంది పాసై 87శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో 20,083 పరీక్షలు రాయగా 15,529 (77%) ఉత్తీర్ణత వచ్చి రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచింది. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం పరీక్షలకు కొద్ది నెలల ముందు నుంచే తగు కసరత్తు చేసి విద్యార్థులను సానబట్టడంతో గత పదేళ్లలో ఈ ఏడాది ఫలితాల్లో ముందు వరుసలోకి వచ్చింది. 2014లో ప్రథమ 59%, ద్వితీయ 66% ఉండగా ఈ ఏడాది ప్రథమ 77%, ద్వితీయ 83% నమోదు చేశాయి. గత ఏడాది ఈ ఫలితాలు 67%, 78% ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత కూడా గత ఏడాది కంటే 9%, 11% ఎక్కువగా నమోదైంది. సోషల్ వెల్ఫేర్ కాలేజీల్లో చదివిన విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారు. సెకండియర్‌లో 362 మందికి 351 (97%) పాసయ్యారు. హైస్కూల్ ప్లస్‌ల్లో 269కి 160 (59%) మంది మాత్రమే గట్టెక్కారు.




జె.సౌమ్యశాలిని
982, బైపీసీ సెకండియర్

రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్‌కి ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మే నెలలో జరుగుతుంది. పరీక్ష ఫీజును ఈ నెల 15 నుంచి 22 వరకు చెల్లించవచ్చు. పరీక్షలు మే 12 నుంచి 20 వరకు నిర్వహిస్తారు.

రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సెకండియర్ బైపీసీ విద్యార్థి జె.సౌమ్యశాలిని వెయ్యికి 982 మార్కులు సాధించింది. ఆర్ట్స్ గ్రూపులో శ్రీలక్ష్మి 971, ఎంపీసీలో ప్రవల్లిక 970, ఎంపీహెచ్‌డబ్ల్యూలో దుర్గాప్రసన్న 965 మార్కులు సాధించారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, ఇన్చార్జి ప్రిన్సిపాల్ పి.త్రినాథరాజా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

యాజమాన్యాల వారీగా ఉత్తీర్ణత

మేనేజ్‌మెంట్	ఫస్టియర్ శాతం	సెకండియర్ శాతం
ప్రభుత్వ	43	64
ఎయిడెడ్	25	43
ఏపీ సోషల్ వెల్ఫేర్	93	97
హైస్కూల్ ప్లస్	34	59
ప్రైవేటు అన్ ఎయిడెడ్	85	91



బుద్ధ విహార్ వ్యవస్థాపకుడు జగదీశ్వరరావు




వేమగిరి కొండపై నిర్మించిన బుద్ధ విహార్‌లో ఆవిష్కరణకు సిద్ధమైన మహోదయ మైత్రేయ బుద్ధ విగ్రహం

జ్ఞానము.. ఆహ్లాదము!

వేమగిరి కొండపై బౌద్ధ క్షేత్రం

8 నేడు 84 అడుగుల మహోదయ మైత్రేయ బుద్ధ విగ్రహావిష్కరణ



అన్న'వరమే'

- అన్నవరం దేవస్థానంలో సౌకర్యాలకు పెద్దపీట
- ప్రభుత్వం మారడంతో కొండపై భారీగా అభివృద్ధి పనులు
- పూర్తయిన ప్రసాద్‌స్కీం టెండర్లు.. ఏడాదిన్నరలోగా పనుల పూర్తి
- మొత్తం రూ.21 కోట్లతో భక్తులకు వసతి సదుపాయాలు
- ఎకరన్నర స్థలంలో రూ.10.34 కోట్లతో అన్నప్రసాద భవనం
- ఒకేసారి మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాదం
- రూ.11 కోట్లతో క్యూ కాంప్లెక్స్, మురుగునీటి శుద్ధిప్లాంటు
- రూ.8.32 కోట్లతో కాటేజీ.. రూ.80 లక్షలతో రెండో మెట్ల మార్గం
- అయిదేళ్లలో ఆలయ అభివృద్ధిని గాలికి వదిలేసిన వైసీపీ సర్కారు
- ప్రభుత్వం మారాక భక్తుల నుంచి నిరంతర ఐవీఆర్ఎస్ సర్వే
- సదుపాయాలపై ర్యాంకులతో అధికారులకు ముచ్చెమటలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రసిద్ధి చెందిన అన్నవరం సత్యదేవుడి ఆలయానికి భారీగా దశ తిరగబోతోంది. మునుపెన్నడూ లేనివిధంగా ఒకేసారి రూ.21 కోట్లకుపైగా విలువైన అభివృద్ధి పనులు పట్టాలెక్కబోతున్నాయి. గత వైసీపీ పాలనలో ఆలయ నిధులను అభివృద్ధి ముసుగులో వృథా చేసి, తలాకొంత మెక్కేయగా, ఇప్పుడు ప్రభుత్వం మారాక భక్తులకు సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఏళ్ల తరబడి పాతుకుపోయిన సమస్యలకు పరిష్కారం లభించబోతోంది. ఏటా లక్షల్లో తరలివచ్చే భక్తులకు ఇకపై ఏ లోటు లేకుండా మౌలిక సదుపాయాలను భారీగా కల్పించడానికి రంగం సిద్ధమవుతోంది. ఎప్పుడో ప్రసాద్ స్కీం కింద ఆలయానికి నిధులు విడుదలైనా గత ప్రభుత్వం పట్టించుకోక వాటికి గ్రహణం పట్టింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఆలయానికి మహర్దశ పట్టబోతోంది. నిలిచిపోయిన నిధులను రప్పించడంతోపాటు పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. దీంతో త్వరలో ఇవి మొదలు కానున్నాయి. దేవస్థానం సైతం రూ.8.32 కోట్ల సొంత నిధులతో కాటేజీ నిర్మించాలని నిర్ణయించింది. ఇదికాక మరో రూ.80 లక్షలతో కొండపైకి రెండో మెట్ల మార్గం కొత్తగా నిర్మించబోతోంది. గత ప్రభుత్వం ఆలయాన్ని గాలికి వదిలేయగా, ఇప్పుడు ప్రభుత్వం మారాక సీఎం చంద్రబాబు ఆదేశాలతో కొండపై నిరంతర పర్యవేక్షణ జరుగుతోంది.

ఎన్ని సదుపాయాలో...

రూ.21 కోట్లతో ఖరారైన టెండర్లకు సంబంధించి ప్రధానంగా కొండపై అత్యవసరమైన అన్నప్రసాదం భవనాల సామర్థ్యాన్ని రూ.10.34 కోట్లతో పెంచబోతున్నారు. ఒకేసారి మూడువేల మంది కూర్చునేలా అన్నప్రసాదం భవనాలు నిర్మించనున్నారు. సత్రం గదులకు సమీపంలో ప్రస్తుత అన్నప్రసాద భవనానికి అతిసమీపంలో ఈ కొత్త భవనాల సముదాయాన్ని ఎకరంన్నర స్థలంలో నిర్మించబోతున్నారు. వచ్చే నెల నుంచి ఈ పనులు మొదలుపెట్టి ఏడాదిన్నరలోగా పూర్తి చేయాలని భావిస్తున్నారు. అలాగే అన్నప్రసాద భవనాలను ఆనుకుని క్యూ కాంప్లెక్స్, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.9.91 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే భక్తులు ఎంతమంది వచ్చినా సజావుగా అన్నప్రసాద వితరణ జరగనుంది. అలాగే కొండపైకి వచ్చే వేలాది భక్తులకు తాగునీటి వసతి, టాయిలెట్ బ్లాకులను రూ.61.78 లక్షలతో నిర్మించబోతున్నారు. మొబైల్ టాయిలెట్లను కూడా తీసుకువచ్చి కొండపై మరింత స్వచ్ఛ వాతావరణాన్ని పెంపొందించాలని భావిస్తున్నారు. కొండపైన భక్తులకు అందుబాటులోకి రూ.97.98 లక్షలతో రెండు ఎలక్ట్రికల్ బస్సులు రాబోతున్నాయి. ఇదికాక రూ.1.08 కోట్లతో కొండపై మురుగునీటిశుద్ధి నిర్వహణ చేపట్టనున్నారు. ప్రసాద్ స్కీం పనులతో సంబంధం లేకుండా ఆలయ నిధులతో పలు పనులు ప్రారంభించబోతున్నారు. అందులో రూ.8.32 కోట్లతో 125 గదులు నిర్మించేందుకు టెండర్లు పిలవగా దేవదాయ కమిషనర్ ఆమోదం తెలిపారు. రూ.80లక్షలతో కొండదిగువ నుంచి కొండపైకి రెండో కొత్త మెట్ల మార్గం పనులు ప్రారంభించారు. అలాగే రూ.2 కోట్లతో పశ్చిమరాజగోపురం వద్ద ఓ ఫార్మా సంస్థ షెడ్ల నిర్మాణానికి ముందుకొచ్చింది.



అప్పుడంతా గాలికి.. ఇప్పుడు ఐవీఆర్ఎస్..

గత వైసీపీ సర్కారు అన్నవరం దేవస్థానాన్ని గాలికి వదిలేసింది. ఏ చిన్న అభివృద్ధి పని చేయకుండా అయిదేళ్లు ఆలయాన్ని పట్టించుకోవడం మానేసింది. ఆలయ ఖజానాపై కన్నేసి కొండకింద అక్కర్లేని నమూనా ఆలయం పేరుతో కోట్లకు కోట్లు వృథా చేసేసింది. పనుల ముసుగులో కొందరు నేతలు భారీగా కాసులు నొక్కేశారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత ప్రభుత్వం అన్నవరం దేవస్థానంపై ప్రత్యేక దృష్టిసారించింది. భక్తులకు ఏ చిన్న ఇబ్బంది లేకుండా వసతులపై నిరంతరం పర్యవేక్షణ జరుపుతోంది. భక్తులకు ఫోన్లు చేసి ఐవీఆర్ఎస్ విధానంలో అభిప్రాయ సేకరణ జరుపుతోంది. భక్తులు తమ ఫోన్ నుంచి క్యూఆర్‌కోడ్ స్కాన్ చేస్తే ఆ నంబరుకు ఐవీఆర్ఎస్ కాల్స్ వెళ్తాయి. అప్పుడు వారు తమ అభిప్రాయాలను తెలిపిన దాన్ని బట్టి ఆలయానికి ప్రభుత్వం ర్యాంకింగ్ ప్రకటిస్తుంది. కొన్ని నెలల కిందట తొలి విడతలో ప్రకటించిన ర్యాంకులో దేవస్థానానికి చివరి ర్యాంక్ వచ్చింది. దీంతో సీఎంవో కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. దీంతో కలెక్టర్ నెలకొకసారి పర్యటించి పరిస్థితులు మెరుగుపరచడంతో ఆ తర్వాత సర్వేలో ఆలయానికి రెండో ర్యాంకు లభించింది. దీంతో ఆలయ అధికారులు నిత్యం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తూ భక్తులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నారు. సత్రం గదుల పరిశుభ్రత నిర్వహణ బాధ్యతలకు సంబంధించి ఒక్కో కాటేజీ ఒక్కో ఏఈవోకు అప్పగించారు. వీరు ప్రతిరోజు సత్రంగదులు తనిఖీచేసి రిపోర్టును అందజేస్తున్నారు. సీఆర్వో విభాగంలో పూర్తి ప్రక్షాళన చేపట్టారు. త్వరగా దర్శనానికి క్యూలైన్ వ్యవస్థలోనూ మార్పులు చేపట్టారు.

ఎక్కడికక్కడ లోపాలు సరిదిద్దుతూ..

అన్నవరం సత్యదేవుడి దర్శనానికి ఏటా తెలుగురాష్ట్రాలతో పాటు ఒడిషా, పశ్చిమబెంగాల్ నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ఏడాదికి ఇక్కడకు వచ్చే భక్తులు కోటి మందిపైనే ఉంటారు. తీరా భక్తుల రద్దీకి తగ్గట్టుగా కొండపై పెద్దగా సదుపాయాలు లేవు. దీంతో భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా అన్నప్రసాదానికి తాకిడి అధికంగా ఉంటోంది. ప్రస్తుతమున్న అన్న ప్రసాద భవనాలు ఒకేసారి 400 మంది మాత్రమే సరిపోతున్నాయి. దీంతో చాలా నిరీక్షణ ఉంటోంది. రద్దీ సమయాల్లో అయితే గంటల తరబడి వేచి ఉండలేక కొందరు కొండ కిందకు వెళ్లిపోతుంటే, కొందరు ధరాభారమైనా హోటళ్లలో తింటున్నారు. మరోవైపు ఇటీవల ఆలయంలో భక్తులకు అందుతున్న సదుపాయాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఈ లోపాలు అధికంగా వ్యక్తమయ్యాయి. ఫలితంగా ఆలయ పనితీరుకు సంబంధించి ర్యాంకు అట్టడుగుకుపోయింది. దీంతో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కలెక్టర్ ఆకస్మికంగా కొండపై పర్యటించి అన్న ప్రసాద కేంద్రంలో భక్తులకు బఫే విధానం అమలుచేయించారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొండపై కొందరికే అన్నప్రసాదం అందేది. రద్దీ సమయంలో రోజుకు 2,500 మందికి కూడా భోజనం వడ్డించలేదు. కానీ ప్రభుత్వం మారడంతో అందరికీ అన్న ప్రసాదం ఇవ్వాలని కంకణం కట్టుకుంది. ఈ మేరకు ప్రసాద్ స్కీం కింద నిధులతో ఈ సదుపాయాలను భారీగా కల్పించాలని నిర్ణయించింది. వాస్తవానికి అన్నవరం దేవస్థానం కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిట్యుయల్ అగు మెంటేషన్ డ్రైవ్) స్కీం కింద 2021లో ఎంపికైంది. దీంతో వచ్చే నిధులతో కొండపై మౌలిక సదు పాయాల కల్పన చేపడుతున్నట్టు అప్పట్లో వైసీపీ సర్కారు ఊదరగొట్టింది. స్కీం కింద ఆలయానికి రూ.48 కోట్లు వస్తాయని ప్రకటించింది. కానీ చిల్లిగవ్వ రాలేదు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత కేంద్రంతో సంప్రదింపులు చేయడంతో రూ.21 కోట్లు విడుదలకాగా, ఇటీవల టెండర్లు పూర్తవగా, పనులు ప్రా రంభం కానున్నాయి. త్వరలో రెండో విడత కింద మరో రూ.20 కోట్లు రానున్నాయి.



15 నిమిషాల్లో గమ్యం...

మీడియాతో మాట్లాడుతున్న ఐజీ, ఎస్పీ తదితరులు

అంతలోనే మృత్యువు!

- ప్రవీణ్ మృతికి కారణం రోడ్డు ప్రమాదమే
- పోలీసుల దర్యాప్తులో వెల్లడి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

చుర్రున ఎండ.. సుమారు 500 కిలోమీటర్ల ప్రయాణం.. మద్యం.. అజాగ్రత్త.. వేగం వెరసి పాస్టర్ ప్రవీణ్ ప్రాణాలను తీశాయని పోలీసుల దర్యాప్తులో తేలింది. గత నెల 24న హైదరాబాద్‌లోని ఫస్ట్ రేట్ ఇన్ఫోటెక్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ, క్రైస్తవ బోధకుడు, మోటివేషనల్ స్పీకర్ పాస్టర్ పగడాల ప్రవీణ్ హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం బయలుదేరి 12 గంటలు ప్రయాణించి ఇంకో 15 నిమిషాల్లో గమ్యం చేరుతారనగా మృత్యువాత పడ్డారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆధారాలను విశ్లేషణ చేసి రోడ్డు ప్రమాదమని తేల్చారు. దానికి మద్యం, వేగం, అజాగ్రత్త కారణమని చెప్పారు. ప్రవీణ్ ప్రయాణంలో మూడు సార్లు ప్రమాదాలు జరిగాయి. ప్రవీణ్ మార్గ మధ్యలో నాలుగుసార్లు ఆగి మొత్తం రూ.2,842 విలువ చేసే మద్యం (బడ్వైజర్ మాగ్నం బీర్లు, రాయల్ చాలెంజ్ విస్కీ, బకార్డి జిన్) కొనుగోలు చేశారు.

● దర్యాప్తు సాగిందిలా..

కేసు తీవ్రత దృష్ట్యా డీఎస్పీ జి.దేవకుమార్ ఇంచార్జిగా, డీఎస్పీ వై.శ్రీకాంత్ పరిశోధనాధికారిగా ఐదు దర్యాప్తు బృందాలను ఏర్పాటుచేశారు. విజయవాడ నుంచి ప్రమాదం జరిగిన ప్రదేశం వరకూ ఒక బృందం, విజయవాడ నుంచి హైదరాబాద్ వరకూ ఒకటి, హైదరాబాద్ నగరంలో నివాస స్థలం వరకూ మరొకటి, విజయవాడ నగరంలో సీసీ కెమెరాలు పరిశీలన ఒక బృందం, సాంకేతిక విశ్లేషణకు.. ఇలా ఐదు బృందాలకు పని అప్పగించారు. జిల్లా ఫింగర్ ప్రింట్స్ యూనిట్, జిల్లా రవాణా అధికారి, ఇద్దరు ఎంవీఐ, ఇద్దరు ఏఎంవీఐ బృందం, మంగళగిరి నుంచి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్‌తో కూడిన బృందం ఘటనా స్థలాన్ని, బైక్‌ని క్షుణ్ణంగా పరిశీలించింది. హెల్మెట్, కళ్లజోడు, ఎన్ 95 మాస్కు, రక్తపు మరకలు ఉన్న వస్తువుల నమూనాలను ఆర్ఎఫ్ఎస్ఎల్‌కి పంపించారు.

● ప్రమాదం జరిగింది ఇలా..

ఐజీ అశోక్ కుమార్.. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌తో కలిసి ఈ కేసు దర్యాప్తు వివరాలను శనివారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం చేరుకునే క్రమంలో మద్యం మత్తు ప్రభావం ఆయనపై ఉండడంతో సుమారు గంటకు 70 కిలోమీటర్ల స్పీడుతో కేవలం సిగ్నల్ లైటు వెలుతురులో డ్రైవ్ చేస్తూ కొంతమూరు నయారా పెట్రోల్ బంకు సమీపంలో అదుపుతప్పి రోడ్డు దిగారు. రోడ్డు బెర్మ్‌పై కంకర పరిచి ఉంది. దానిపై జారి 7 అడుగుల లోతులో ఉన్న ఒక రెయిన్ వాటర్ డ్రెయిన్‌లోని గోతిలో పడిపోయారు. ఆయనపై బుల్లెట్ పడింది. ఆయన శరీరంలోని కాలేయం, కిడ్నీ తదితర భాగాల్లో ఇథైల్ ఆల్కహాల్(మద్యం) గుర్తించామని ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులో ఉంది. ఆయన ప్రమాదం జరిగిన చోటే ప్రాణాలు విడిచారని పోస్టుమార్టం చేసిన వైద్యుల బృందం రిపోర్టు చెబుతోంది.



వైద్యుల బృందం శవ పరీక్ష చేసింది. కొవ్వూరు టోల్‌గేట్ దాటిన తర్వాత అంటే ప్రమాదం జరగడానికి కొద్దినిమిషాల ముందు.. ప్రవీణ్ వాహనంతోపాటు ప్రయాణించిన వాహనాలను పరిశీలించారు. రాపిడి మరకలు ఏమీ లేవని నిర్ధారించుకున్నారు. మార్గమధ్యలో ఆయన 6 చోట్ల యూపీఐ పేమెంట్లు చేశారు. అవి ఆయన ఎక్కౌంటుతో సరిపోయాయి. గతనెల మార్చి 12, 13 తేదీల్లో రాజమండ్రిలో సుధా వైన్స్‌లో ప్రవీణ్ మద్యం కొనుగోలు చేసిన ఫుటేజీలనూ సేకరించారు. మొత్తం 14 రోజుల దర్యాప్తులో 100 మందిని విచారించారు. మార్గమధ్యలో ఆరుగురితో ఫోనులో మాట్లాడారు. అవి మామూలు మాటలే. ఒకసారి భార్యతో మాట్లాడారు. విజయవాడ దాటుతున్నానని ముక్తసరిగా చెప్పి ఫోన్ పెట్టేశారు.

ఇప్పుడైనా నిగ్గు తేలుస్తారా!

- ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌లో పంచాయతీ అధికారులపై అవినీతి ఆరోపణలు
- విచారణలో కాలయాపన... తాజాగా విచారణాధికారిగా డీపీవో శాంతామణి నియామకం

రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అధికారులు మారుతున్నారు... ప్రభుత్వాలు మారుతున్నాయి... చివరకు జిల్లాలు కూడా మారాయి... అయినా అవినీతి ఆరోపణలతో చార్జి మెమో ఇచ్చిన వారిపై నేటికీ చర్యలు లేవు.. సరికదా విచారణలు కొనసాగుతూనే వున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట, పిడింగొయ్యి పంచాయతీల పరిధిలో ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ప్రభుత్వానికి లక్షలాది రూపాయలు నష్టం చేకూర్చారన్న ఆరోపణలొచ్చాయి. దీంతో 2016లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అప్పటి గ్రామాల ప్రత్యేకాధికారి, డీఎల్పీవో కేపీ చంద్రశేఖర్, హుకుంపేట గ్రామ కార్యదర్శి బి.రామశ్రీనివాస్, పిడింగొయ్యి గ్రామ కార్యదర్శి, ధవళేశ్వరం పంచాయతీ ప్రస్తుత కార్యదర్శి జి.వెంకట్రావులకు చార్జ్ మెమో జారీ చేశారు. అప్పటి ఉమ్మడి జిల్లా పంచాయతీ అధికారులుగా పనిచేసిన టీవీజీ కుమార్, వి.నాగేశ్వరనాయక్‌లను విచారణాధికారులుగా నియమించారు. విచారణ ప్రక్రియను పూర్తి చేయకుండా కాలయాపన చేశారు. తాజాగా ప్రస్తుత జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణిని విచారణాధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ ప్రక్రియను ఇప్పుడైనా నిష్పక్షపాతంగా నిర్వహిస్తారో లేదో వేచి చూడాలి. కాగా విచారణాధికారి మార్పు విషయంలో రూరల్ మండలానికి చెందిన ప్రముఖ అధికారి చక్రం తిప్పినట్టు పలువురు ఆరోపిస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి కారు పల్టీ



● ఏడుగురికి స్వల్ప, ముగ్గురికి తీవ్ర గాయాలు

.... వివరాలు 10లో

రెక్కలూడుతున్న వైసీపీ

కూటమిలోకి ఒక్కొక్కరుగా చేరుతున్న ఆ పార్టీ నేతలు

జనసేన ఖాతాలో తొలి మున్సిపాల్టీ నిడదవోలు



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రతిపక్ష వైసీపీ రెక్కలు ఊడిపోతున్నాయి. అధికారం కోల్పోయిన ఏడాదికే ఆ పార్టీలో తీవ్ర ఉక్కబోత మొదలైంది. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకెళ్తుండడంతో ప్రజలు సానుకూలంగా కనిపిస్తున్నారు. దీంతో వైసీపీ నేతలు ఒక్కొక్కరుగా నెమ్మదిగా పార్టీని విడిచి పెట్టేస్తున్నారు. కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ ఇప్పటికే సుమారుగా ఖాళీ అయిపోయింది. కొందరు జడ్పీటీసీలు, ఎంపీపీ టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. మున్సిపల్ చైర్‌పర్సన్ వైసీపీకి చెందిన వారైనప్పటికీ ఆమె టీడీపీ నేతలతో సన్నిహితంగా ఉండడం గమనార్హం. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నియోజకవర్గమైన నిడదవోలు మున్సిపాల్టీ జనసేన ఖాతాలో జమ అయింది. ఇది రాష్ట్రంలో ఆ పార్టీకి దక్కిన తొలి మున్సిపాల్టీ కావడం గమనార్హం. నిడదవోలు మున్సిపాల్టీని గత ఎన్నికల్లో వైసీపీ గెలుచుకుంది. 28 మంది కౌన్సిలర్లు ఉండగా 27 మంది వైసీపీ నుంచి, ఒకరు టీడీపీ నుంచి గెలిచారు. కానీ మంత్రి కందుల దుర్గేష్ రాజకీయ చతురతతో చైర్మన్, వైస్ చైర్మన్ సహా మొత్తం 13 మంది కౌన్సిలర్లు జనసేనలో చేరారు. ఒక టీడీపీ కౌన్సిలర్‌తో వీరి సంఖ్య 14కు చేరింది. మంత్రి దుర్గేష్‌కు ఎక్స్‌అఫీషియో సభ్యునిగా ఓటు హక్కు ఉండడంతో జనసేన బలం 15కి చేరింది. ఈ నేపథ్యంలో వైసీపీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చింది. కానీ మెజార్టీ సభ్యులు కూటమివైపు రావడంతో అది వీగిపోయింది. ఇటీవల బిక్కవోలు ఎంపీపీ పీఠం బీజేపీకి దక్కిన సంగతి తెలిసిందే. అక్కడ వైసీపీ కనీసం పోటీకి కూడా రాలేకపోయింది.



'నిడదవోలు'ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

మంత్రి దుర్గేష్ 10

జనసేనలో చేరిన కౌన్సిలర్లతో మంత్రి దుర్గేష్

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

15 మంది లబ్ధిదారులకు రుణాలు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి): పీఎం అజయ్ పథకంలో భాగంగా 15 మందికి మంజూరైన రూ. 20 లక్షల రుణాలను ఎమ్మె ల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం వెలుగు ఏపీఎం ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని చాగల్లు, తాళ్లపూడి, కొవ్వూరు మండలాలకు సంబంధించిన మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ పథకంలో సభ్యురాలు లబ్ధిదారుని వాటా కింద రూ. 10 వేలు చెల్లించినట్టయితే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. 40 వేలు రుణం ఇస్తుండగా, ప్రభుత్వం రూ. 50 వేలు సబ్సిడీని మంజూరు చేస్తుందని ఏపీఎంలు తెలిపారు. వెలుగు ఏపీఎంలు ఎం. మంగాయమ్మ, కే. విజయ నిర్మల, పీసాయి లక్ష్మి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరికి విశేష పూజలు



కొవ్వూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న శ్రీబాలాత్రిపుర సుందరి అమ్మవారికి చైత్ర మాస పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించి, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం లలిత సహస్రనామ పారాయణం చేశారు. పూజలలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అఖండ గోదావరిమాతకు మహా నీరాజనం

కొవ్వూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అఖండ గౌతమి గోదావరి మాతకు శనివారం మహా నీరాజనం అందజేశారు. కొవ్వూరు గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో చైత్రమాస పూర్ణిమను పురస్కరించుకుని ప్రదోషకాలంలో గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో గోదావరిమాతకు అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. 235 వ మాసోత్సవంలో భాగంగా గోదావరి మాతకు వివిధ రకాల హారతులతో నీరాజనం సమర్పించారు. మహిళలు నేతి దీపాలను వెలిగించి నదిలో వదిలారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన

పెరవలి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): భూమికి పచ్చిరొట్ట విత్తనం ఎంతగానో మేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. 2025 ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం ముక్కామలలో పచ్చిరొట్ట ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతివ్యవసాయ సిబ్బంది సూర్యనారాయణ, గుడాల వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణ, భవాని, లక్ష్మీప్రశాంతి, వెంకటరమణ పాల్గొన్నారు.

'నిడదవోలు'ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా : మంత్రి

నిడదవోలు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిడదవోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో జనసేనలో చేరిన కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రవేశపెట్టనున్న చైర్మన్‌పై అవిశ్వాసానికి కూడా అవకాశం లేకుండా కౌన్సిల్ జనసేన వశం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో అందరి ఆదరాభిమానాలను పొందుతూ జనసేన బలోపేతం అవుతోందన్నారు. నిడదవోలు అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి వైసీపీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు జనసేనలో చేరడం అభినందనీయమన్నారు. నిడదవోలు పట్టణాన్ని రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, పువ్వల రతీదేవి, చిలకల శారదాదేవి, తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ జయంతిని శాంతియుతంగా జరుపుకోవాలి'

తాళ్లపూడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ టీ.రామకృష్ణ తెలిపారు. ఎక్కడా డీజేలకు అనుమతులు లేదన్నారు. ముగ్గుల పోటీలు, నిరుపేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను చేపట్టుకోవాలని సూచించారు.

ఘనంగా అచ్చిబాబు జన్మదిన వేడుకలు

- వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు
- పలుచోట్ల రక్తదాన శిబిరాలు





కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ద్విసభ్య కమిటీ సభ్యులు, రక్తదానం చేస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

కొవ్వూరు, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత, ఆంధ్రా సుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక టీడీపీ కార్యాలయంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో నిర్వహించగా, ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై అభిమానులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. అలాగే కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. దీనిలో భాగంగా కార్యకర్తలు, అభిమానులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటుచేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం, వృద్ధాశ్రమాల్లోని వారికి దుస్తులు పంపిణీ చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు రిక్షా కార్మికులకు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అచ్చిబాబు జన్మదిన వేడుకలు ఎన్డీఏ కూటమి నాయకులంతా అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అలాగే ఏప్రిల్ 20వ తేదీన సీఎం చంద్రబాబు పుట్టినరోజును పురస్కరించుకుని మరోసారి రక్తదానం శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కొవ్వూరు పట్టణ, మండల అధ్యక్షుడు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు,తాళ్లపూడి మండల అధ్యక్షుడు నామాన పరమేష్, నాదెళ్ల శ్రీరామ్, ఆళ్ల హరిబాబు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపాటి సత్యనారాయణ, బేతిన నారాయణ, మద్దిపట్ల సురేష్, ఉండవల్లి గోపాల్, కేవీకే రంగారావు, కలగర సుబ్బారావు, చావా శ్రీనివాసరావు, బర్ల శ్రీనివాసరావు, కాగిత రఘు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు, మంకిన వీరన్న, మేణ్ణి పార్థసారధి, గొరిజాల సురేష్, గారపాటి రామకృష్ణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, బీవీ ముత్యాలరావు, కంటమణి రామకిషోర్, జొన్నలగడ్డ శ్రీనివాస్, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు గెల్లాసురేష్, కొవ్వూరు, కొవ్వూరు పట్టణ, మండలం, తాళ్లపూడి, చాగల్లు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని అచ్చిబాబుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మండలంలోని పంగిడిలో జనసేన నేతలు అచ్చిబాబు పుట్టినరోజును పురస్కరించుకుని సెంటర్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్‌ను ఏర్పాటుచేశారు. అనంతరం అచ్చిబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసైనికులు కొప్పాక విజయకుమారి, చౌటిపల్లి శివ, పెరుగు శివ, మడిచర్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో చండీహోమం

కొవ్వూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోని వాజపేయి సత్రంలో వేంచేసియున్న జ్ఞాన సరస్వతి ఆలయంలో శనివారం చండీహోమాన్ని నిర్వహించారు. ఆత్మీయ హితకారిణి సమాజం ఆధ్వర్యంలో పట్టణ వాస్తవ్యుడు మల్లంపల్లి చంద్రశేఖర్, కృషి కృష్ణవేణి దంపతులచే పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నళిని వాజపేయి, వాడ్రేవు సుబ్రహ్మణ్యం, చామర్తి విశ్వనాధరావు, గంప కృష్ణారావు, గరిమెళ్ళ సత్యనారాయణ శర్మ,ఏడిద సత్యనాగ శివతేజ, వైవిఎస్ కామేశ్వరరావు, కస్తూరి కాంతారావు, ఏడిద వీర వెంకట సత్యనారాయణ మూర్తి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో బాలికలే టాపర్స్

తాళ్లపూడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో మొదటి, రెండో సంవత్సరం పరీక్షలలో బాలికలే టాపర్స్‌గా నిలిచారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కొడమంచిలి ప్రియాంక (ప్రథమ స్థానం), ద్వితీయస్థానంలో కస్సే హారికా లక్ష్మి, తృతీయ స్థానంలో చుక్కా త్రిపూర్ణ నిలిచారు. అలాగే మొదటి సంవత్సరంలో ప్రథమ స్థానంలో యు. గీతికా కృతి, ద్వితీయ స్థానంలో లంకా తనూజ, తృతీయస్థానంలో కేవీఎల్ లక్ష్మి నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్స్‌పాల్ మాట్లాడుతూ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 55 శాతం, మొదటి సంవత్సరంలో 45 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో తిరుమల ప్రభంజనం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో తిరుమల అకడమిక్ డైరెక్టర్లు

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో రాజమహేంద్రవరం తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 కు 467 మార్కులు ఐదుగురు విద్యార్థులు యు.వెరోనిక, ఎం.హర్షిత, ఎస్.తేజ, జి.రాజనవీన్ తేజ, ఎ.వీరవెంకట సాయిలిఖి సాధించారని, 466 మార్కులు పైన 31 మంది, 464 మంది పైన 369 మంది, 460 పైన 1086 మంది, 450 పైన 2,133 మంది సాధించి 99.20 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 440కి 436 మార్కులు 11 మంది విద్యార్థులు కె.సుప్రియ, ఎ.రామతేజస్విని, సీహెచ్ నేహాగ్రేస్, జి.మోహనరూప, జె.భవిత, కె.గాయత్రి, జి.సరయు, బి.యశశ్విని, షేక్ సమీనా, ఆర్.వీరగంగ నాగేంద్ర, పి.ప్రణవసాయిగణేష్ సాధించారని, 435 పైన 32 మంది, 433 పైన 91 మంది, 430పైన 167 మంది, 400 పైన 463 మంది మార్కులు సాధించి 99.47 ఉత్తీర్ణత సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 991 మార్కులు ఏడుగురు విద్యార్థులు ఎం.ప్రియహాసిని, సీహెచ్ హరిసూర్య, బి.పవిత్ర, కె.మానస, ఎస్.లేఖన, ఎస్.సా యిలిఖిత, వి.దాత్రికావ్యశ్రీ సాధించారన్నారు. 23 మంది విద్యార్థులకు 990 మార్కులు, 331 మంది విద్యార్థులకు 985 పైన, 791 మంది విద్యార్థులకు 980 పైన, 2,151 మంది విద్యార్థులకు 950 మార్కులు పైన సాధించి 99.98 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను షేక్ ఫాతీమున్నీషాబేగం 991 మార్కులు, బి.నాగవైష్ణవి, సీహెచ్ వీడీ రేణుక, ఎస్.వైష్ణవి, బిహర్షిత, ఎస్.మణి, జి.రితిక 990 మార్కులు సాధించారన్నారు. 108 మంది విద్యార్థులకు 980 పైన, 204 మంది విద్యార్థులకు 970 పైన, 297 మంది విద్యార్థులకు 950 పైన మార్కులు సాధించి ఉత్తీర్ణత నూరుశాతం సాధించారన్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను తిరుమలరావు అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెన్నెల్లో సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణంలో రేకపల్లి వీరాస్వామి దంపతులు

తాళ్లపూడి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి గోదావరీ నదీ తీరం వద్ద ఉన్న గౌతమేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో శనివారం వెన్నెల్లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఒంటిమిట్ట రామాలయం తరహాలో గత నాలుగు సంవత్సరాలుగా వెన్నెల్లో కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు కవల శ్రీనివాస్ తెలిపారు. రేకపల్లి వీరాస్వామి, రమాదేవి దంపతులచే కల్యాణోత్సవాన్ని జరింపించారు. కల్యాణానికి టీటీడీ హిందూ ధర్మ ప్రచారక్ పరస రాధాకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వరి పంటకోత ప్రయోగం

తాళ్లపూడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బల్లిపాడులో రైతులు వల్లభని చిన బసవన్న, వల్లభని ఉదయభాస్కర్ చేపట్టిన వరి పంటలో పీఆర్ 126 అనే రకం పంటపై శనివారం పంటకోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కొవ్వూరు ఉప గణాంకాధికారి సోమరాజు, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు షక్ హసీనా, రమణ, సురేంద్ర, బీమా ఏజెంట్ గంజి శ్రీనుబాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలు వేయండి ... భూసారాన్ని పెంచండి



ముసుళ్లకుంటలో అవగాహన ర్యాలీలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నల్లజర్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాలు వేయండి భూసారాన్ని పెంచండి అంటూ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం ముసుళ్లకుంటలో సర్పంచ్ నందమూరి శారదదేవి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ డివిజన్ మాస్టర్ ట్రైనర్ సోమిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు వాడటం వల్ల భూమి సారవంతంగా ఉండి బలం వస్తుందని రైతులకు సూచించారు. రైతులు నందమూరి రామకృష్ణ, దుర్గారావు, నాగలక్ష్మి, రామలక్ష్మి, వీరాస్వామి పాల్గొన్నారు.

దేవరపల్లిలో అన్నసమారాధన



దేవరపల్లిలో రామాలయం వద్ద అన్నసమారాధన

దేవరపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి రామాలయం వద్ద శ్రీరామనవమి మహోత్సవాల సందర్భంగా శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సీతారాములకు ఉదయం ప్రత్యేకపూజలు, అభిషేకాలు గావించారు. పలుగ్రామాల నుంచి భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

కొవ్వూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ 86 మంది జనరల్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 54 మంది 63 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఒకేషనల్‌లో 21 మందికి 16 మంది 76 శాతం ఉత్తీర్ణత సాధించారు. తెడ్డుచందు (ఎంపీసీ) 438, యంట్రప్రగడ ఐశ్వర్యాంబిక (బైపీసీ) 425, ఆకుమూరి హాసిని (ఐసీఈసీ) 459, పాలపర్తి మనీషా ప్రసన్న (ఒకేషనల్) 458, సీనియర్ ఇంటర్ 63 మంది జనరల్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 46 మంది 73 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ 13 మందికి 13 మంది 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్. సత్యనారాయణ తెలిపారు. కుంజ కీర్తన (బైపీసీ) 935, ఆరుగొలను శ్రీలేఖ (బైపీసీ) 890, గంగిరాజు లక్ష్మీ సాయిదుర్గ (ఒకేషనల్) 964 మార్కులు సాధించారన్నారు. కొవ్వూరు మండలం కుమారదేవం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ 74 మందికి 74 మంది విద్యార్థులు 100 శాతం ఉత్తీరణ సాధించగా, సీనియర్ ఇంటర్ 74 మందికి 72 మంది విద్యార్థులు 97.29 శాతం ఉత్తీర్ణత సాధించారు. కళాశాలలో సీనియర్ ఎంపీసీ చదువుతున్న బుట్టాయిగూడెం మండలం కోయ రాజమండ్రికి చెందిన కోయ మాధురి సంజన 956, తాళ్లపూడి మండలం రాగోలపల్లికి చెందిన పొనుకుమాటి తేజ 951, చాగల్లుకు చెందిన బొల్లిపో రాఘవర్ధిని 941, సీనియర్ బైపీసీలో గోపాలపురం మండలం పెద్దగూడెంకు చెందిన వర తేజస్విని 954, యర్నగూడెంకు చెందిన దేశెట్టి వెంకట సరస్వతి 952, అచ్చన్నపాలెంకు చెందిన ఉండ్రాజవరపు స్రవంతి 951 మార్కులు మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పి. సుజాత తెలిపారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ 173 మందికి 97 మంది 56 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్ 163 మందికి 124 మంది 76 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇ. శ్రీకాంత్ (ఒకేషనల్ మెకానిక్ గ్రూపు) 960 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ గారపాటి సతీష్ తెలిపారు.

నిడదవోలు: పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ రెండోసం వత్సరం పరీక్షా ఫలితాల్లో పలువురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ బీ. గీతాంజలి తెలిపారు. మహమ్మద్ రెహానా (రెండో ఎంపీసీ) 1000/979, రాపాక భవాని (రెండో సీఈసీ 1000/974), ఘంటసాల హర్షిత (రెండో బైపీసీ 1000/945), కె.లక్ష్మి తులసి (రెండో ఓఏ 1000/911), జీ.కృపామణి (రెండో హెచ్ఈసీ 1000/824) మార్కులు సాధించారన్నారు.

గోపాలపురం: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో గోపాలపురం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలిక ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం 96.85 శాతం, మొదటి సంవత్సరం 98.64 శాతం ఉత్తీర్ణత సాధించారు. వారిలో ద్వితీయ సంవత్సరానికి చెందిన బైపీసీ విద్యార్థి ఎం.నిర్మలాకుమారి వెయ్యి మార్కులకు 980 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే ద్వితీయ సంవత్సరంలో మొ త్తం 64 మంది విద్యార్థులకు గాను 62 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం 74 మందికి గాను 73 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో బైపీసీకి చెందిన విద్యార్థి నవ్యశ్రీ 440 మార్కులకు 430 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో సాధించింది. మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థి రోజి 470 మార్కులకు గాను 446 మార్కులు సాధించింది. ప్రథమస్థానం సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

చాగల్లు: స్థానిక ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితియ సంవత్సరంలో విద్యార్థులు 87 ఉత్తీర్ణత సాధించారు. 55 మంది పరిక్షలకు హాజరుకాగా 48 మంది ఉత్తీర్ణత సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. పావని తెలిపిన వివరాలు ప్రకారం ఎంపీసీ విద్యార్థిని విపుష్ప లక్ష్మికుమారి 931 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. బైపీసీ విద్యార్థి లక్ష్మి మౌనిక 907 మార్కులు సాధించి ద్వితియ స్థానం పొందింది. సీఈసీలో ఏ. దానేశ్వరి 878 మార్కులుతో తృతీయ స్థానం పొందింది. ప్రథమ సంవత్సరంలో 83 మంది విద్యార్థులు పరిక్షలకు హాజరుకాగా 43 మంది ఉత్తీర్ణత సాధించి 52 శాతం సాధించారు. ఎంపీసీ విద్యార్థిని షేక్ షమీల 417 మార్కులుతో ప్రథమ స్థానం సాధించింది. బైపీసీలో వీరవల్లి దుర్గాదేవి 398 మార్కులుతో ద్వితియ స్థానం సాధించింది. సీఈసీ విద్యార్థి బి. తేజ 456 మార్కులు సాధించాడు. హెచ్ఈసీలో వి. గుణశ్రీ 332 మార్కులు సాధించింది.

ఇంటర్ ఫలితాల్లో 'షిర్డీసాయి' విజయబావుటా



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ శ్రీధర్, అధ్యాపకులు

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షా ఫలితాల్లో షిర్డిసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో విజయబావుటా ఎగురవేశారని శ్రీషిర్డిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య వెల్లడించారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ 470 మార్కులకు 465 మార్కులతో జి.మెహర్‌సత్యప్రసాద్, ఎం.అభినవ్ వివేక్‌లు ప్రథమ స్థానంలో నిలవగా, 464 మార్కులతో ఎస్‌వీపీ వర్షిత్, ఎం.తను శ్రావ్యశ్రీ, వై.బ్లెస్సీ ద్వితీయస్థానాన్ని, 463 మార్కులతో బి.సాయిప్రకాష్, కె.తేజస్విని, ఎస్.నిత్యశ్రీ, పి.భద్రసాహితీ, ఎస్.లలిత, ఆర్.హజీరా తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బైపీసీలో 440 మార్కులకు గాను 428 మార్కులతో ఎస్.తేజశ్రీ ప్రథమ స్థానాన్ని, 416 మార్కులతో డి.దేవిసాయి ద్వితీయ స్థానాన్ని సాధించారు. మొత్తం 16 మంది విద్యార్థులు 460 పైగా మార్కులు సాధించగా, 63 మంది 450 పైగా 153మంది 420 పైగా 400 మార్కులు పైగా సాధించారని శ్రీధర్ తెలిపారు.

- ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో వి.మణికంఠ 990 మార్కులతో ప్రథమస్థానాన్ని, ఎం.హాసిని, ఎన్.నందిని, వి.శివకేశవ, జి.సాయిముఖేష్ 987 మార్కులతో ద్వితీయస్థానాన్ని, జి.దివ్య 986 మార్కులతో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బైపీసీలో 976 మార్కులతో కె.హిమశ్రీ ప్రథమస్థానాన్ని, 974 మార్కులతో కె.శిరీష ద్వితీయస్థానాన్ని సాధించారు. 13 మంది విద్యార్థులు 980 మార్కులు పైగా సాధించగా, 53 మంది 970కి పైగా, 107 మంది 950 పైగా, 125 మంది 920పైగా, 203 మంది 900 మార్కులు పైగా సాధించారని శ్రీవిద్య తెలిపారు.

కోకో పంటకు ధరల స్థిరీకరణను వర్తింపజేయాలి



ఉద్యాన శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కోకో రైతులు

నల్లజర్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కోకో గింజల కొనుగోలు, ధర సమస్యను పరిష్కరించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కోకోకు ధరల స్థిరీకరణ పథకం వర్తింపజేయాలని మండల కోకో పంట రైతు సంఘం సభ్యులు శనివారం ఉద్యాన శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఉద్యాన శాఖ అధికారి బబితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతేడాది అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలకు రూ. 1040 ధర పలకగా, ఈ ఏడాది రూ. 700 ఉందన్నారు. పాతూరి సత్యనారా యణ, కోనేరు వెంకట కృష్ణారావు, కొయ్యలమూడి రాజేష్, మేణ్ణి సందీప్, గన్నిన భాస్కరరావు, కాండ్రేకుల ఆంజనేయులు పాల్గొన్నారు.

తాడిపర్రులో నాయకుల ఆధ్వర్యంలో చలివేంద్రం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రు గ్రామంలో కూటమి నాయకులు ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు ప్రారంభించారు. బాటచారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో నాయకులు గారపాటి సత్యనారాయణ, సుంకవల్లి దుర్గాప్రసాద్, మారిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్క ఇంట్లో చెల్లెలు చోరీ

- 198 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ. పది వేల నగదు అపహరణ

నిడదవోలు, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడు అనే సామెత అక్షరాలా రుజువైంది. కానీ ఆ చోరీని నిడదవోలు పోలీసులు ఒక్కరోజులోనే ఛేదించారు. నిడదవోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ తెలిపిన వివరాల ప్రకారం ... పట్టణంలోని ఎంవీ నగర్ సమీపంలో నివాసముంటున్న బలిజ శశిలలితా దేవి ఈనెల 10వ తేదీన ఇంటికి తాళం వేసుకుని తను పనిచేస్తున్న పాఠశాలకు వెళ్లగా, దాన్నే అదునుగా తీసుకున్న సొంతచెల్లెలు, తాడేపల్లిగూడెంకు చెందిన పడాల లక్ష్మీశైలజ దొంగతనానికి పాల్పడింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సొంత అక్క ఇంట్లోనే ఇలాంటి దారుణానికి ఒడిగట్టింది. తనకు దొంగతనంలో సహకరించేందుకు తన సమీప బంధువు, ఉండ్రాజవరం గ్రామానికి చెందిన బండి సత్యవేణి సహాయం కోరినట్టు తెలిసింది. అలాగే బీరువాను కట్ చేసేందుకు అదే గ్రామానికి చెందిన కప్పకాయల సురేంద్ర సహాయంతో ఇంట్లోకి ప్రవేశించి గ్యాస్ కట్టర్‌తో తాళాన్ని కట్ చేసి లక్ష్మీదేవి హారం, నల్లపూసల గొలుసు, చెవి బుట్టలు ఒక జత, రెండు గాజులు, చెవి కమ్మలు ఒక జత, చేప లాకెట్ చైన్ ఒకటి, సాధారణ చైన్, గుళ్ళచైన్ ఒక పాపిటబొట్టు ఇలా సుమారు 198 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ. పది వేల నగదును అపహరించుకుపోయినట్టు సీఐ తెలి పారు. సుమారు వీటి విలువ రూ. 12 లక్షల 55 వేల వరకు ఉంటుందన్నారు. ఈ ముగ్గురూ శనివారం తణుకు వెళ్లి బంగారు నగలు విక్రయించేందుకు కానూరు వద్దకు చేరుకోగా పోలీసులు అరెస్ట్ చేసి, బంగారు నగలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టుకు తరలించారు. దొంగతనం జరిగిన ఒకరోజు వ్యవధిలోనే కేసును ఛేదించిన సీఐ పీవీజీ తిలక్, ఎస్ఐ కె.జగన్మోహనరావు, సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

డివైడర్‌ను ఢీ కొట్టిన కారు

- ఏడుగురికి స్వల్ప, ముగ్గురికి తీవ్ర గాయాలు



పల్టీలు కొట్టి పొలంలోకి దూసుకెళ్లిన కారు

దేవరపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబానికి చెందిన 10 మందితో ప్రయాణిస్తున్న కారు మండలంలోని యర్నగూడెం జాతీయ రహదారిపై శనివారం ప్రమాదానికి గురైంది. డివైడర్‌ను ఢీకొట్టడంతో పంట పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం ... చిత్తూరు జిల్లా రామకుప్పం మండల బందార్లపల్లికి చెందిన ఓ కుటుంబం ఈనెల 10వ తేదీన దైవ దర్శనం కోసం కారులో బయల్దేరి విజయవాడలోని కనకదుర్గమ్మ, భద్రాచలంలోని రాములవారిని దర్శించుకున్నారు. ఈ క్రమంలో 11వ తేదీ రాత్రి అన్నవరం చేరుకుని అక్కడే రాత్రి బస చేశారు. అనంతరం శనివారం ఉదయం సత్యనారాయణస్వామి దర్శనం చేసుకుని తిరిగి ప్రయాణిస్తుండగా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో యర్నగూడెం జాతీయ రహదారిపై కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఇందులో ప్రయాణిస్తున్న 10 మందిలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, గౌరక్కగారి చిన్నమ్మాయి, షబ్రేష్, పోతుల చందనాకు తీవ్రగాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్పగాయాలైన వారికి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం తీవ్రగాయాలైన ముగ్గుర్ని రాజమండ్రిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ గౌరక్కగారి శ్రీకాంత్ కారును వేగంగా నడపటం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇందులో గౌరక్కగారి చిన్నమ్మాయి, పోతుల లత, పోతుల సోమశేఖర్, పోతుల యశ్వంత్, పోతుల చందన, భార్గవి, షబ్రేష్, లతిక, శిరీషతోపాటు ముగ్గురు చిన్నారులున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.